ప్రజాశక్తి

ఆదివారం 16 ఫిబ్రవరి 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

పంటలకు పెరిగిన నీటి ఎద్దడి

రబీ సాగుకు ఇబ్బందులు - మిర్చి దిగుబడులపై ప్రభావం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాలో పంటలకు నీటి ఎద్దడి పెరిగింది. కాల్వలకు పూర్తిస్థాయిలో నీరు విడుదల చేయకపోవడం వల్ల పంటలకు ఇబ్బందులు తప్పడం లేదు. దాదాపు 50 రోజులుగా నెలలుగా వర్షాలు ముఖం చాటేశాయి. దీంతో పంటలకు మళ్లీ నీటి అవసరం పెరిగింది. మరో వైపు ఎగువ నుంచి ప్రవాహం కూడా లేకపోవడం వల్ల నాగార్జున సాగర్, పులిచింతల జలాశయాల్లో నీటి నిల్వలు గణనీయంగా తగ్గాయి. ప్రకాశం బ్యారేజి నుంచి ప్రస్తుతం నాలుగు వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నా తూర్పు డెల్టాలో కృష్ణా జిల్లా పరిధిలోనే రెండవ పంటగా సాగు చేసిన వరికి నీరు అందిస్తున్నారు. కానీ పశ్చిమ డెల్టాలో చివరి భూములకు నీరు అందడం లేదు. ప్రధానంగా జొన్న,. మొక్కజొన్న,శనగ పంటలు ఎదుగుదల దశలో ఉన్నాయి. వీటికి తక్షఃణం ఒక తడి అవసరం అని రైతులు చెబుతున్నారు. పులిచింతల జలాశయంలో గరిష్ట నీటి నిల్వ 45.77 టిఎంసిలు కాగా శనివారం రాత్రికి 34.98 టిఎంసిల నీటి నిల్వ ఉంది. పులిచింతలకు ఎగువ నుంచి నీరు రావడంలేదు. దిగువకు రోజు 2 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. అలాగే నాగార్జున సాగర్‌లో గరిష్టనీటి నిల్వ 312 టిఎంసీలు కాగా ప్రస్తుతం 182.08 టిఎంసిలు మాత్రమేనీటి నిల్వ ఉంది. ఉమ్మడి



జిల్లాలో ఖరీఫ్‌లో 1.70 లక్షల ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. మిర్చికి ఇంకా కనీసం ఒక తడి అవసరం అత్యవసరం అని రైతులు తెలిపారు. గుంటూరు జిల్లాలో 1.60 లక్షల ఎకరాల్లో రబీ పంటలు వేశారు. పల్నాడు జిల్లాలో 1.20 ఎకరాలల్లో వివిధ రకాల పంటలను సాగు చేశారు. పల్నాడు జిల్లాలో మిర్చి, శనగ, మొక్క.జొన్న, జొన్న, వరి,కందితో పాటు వివిధ రకాల పంటలకు నీటి అవసరం ఏర్పడింది. పెదకూరపాడు, తాడికొండ, పత్తిపాడు, సత్తెనపల్లి నియోజకవర్గాలల్లోని పలు గ్రామాల్లో పంటలకు నీటి అవసరం పెరిగింది. పల్నాడు జిల్లాలో 48 వేల ఎకరాల్లో వరి, మరో 30 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 7 వేల ఎకరాల్లో కంది, పొగాకు 12 వేలు ఎకరాలు, మినుము 5 వేల ఎకరాలు, ఇతర పంటలు 32 వేల ఎకరాల్లో సాగు చేశారు. ఖరీఫ్‌లో సాగు చేసిన మిర్చికి, రబీలో సాగు చేసిన మొక్కజొన్నకు నీటి అవసరం ఉన్నట్టు రైతులు తెలిపారు. జిల్లాలో వరి 1700 ఎకరాల్లో వేశారు. జొన్న 32 వేల వేల ఎకరాలు, మొక్కజొన్న 48 వేల ఎకరాలు, శనగ 17 వేల ఎకరాలు, పెసర 13 వేల ఎకరాలు, మినుము 14 వేల ఎకరాలు సాగు చేశారు. పొగాకు 9 వేల ఎకరాల్లో వేశారు. రబీ ముగింపు దశకు చేరుకుంది. దీంతో రెండు జిల్లాల పరిధిలో కనీసం 10 రోజుల పాటు నీటి విడుదల పరిమాణాన్ని పెంచాలని రైతులు కోరు తున్నారు. గత పది రోజులుగా ఎండ తీవ్రత పెరుగుతోంది. దీంతో నీటి ఎద్దడి పెరిగి పంటలు బెట్టకు వచ్చే పరిస్థితి ఏర్పడింది. అధికారులు వెంటనే జోక్యం చేసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నిలిచిన అభివృద్ధి పనులు

- విబేధాలతో జరగని గుంటూరు కౌన్సిల్
- ఎన్నికల కోడ్‌తో 8వతేదీ తరువాతే అంటున్న అధికారులు
- మూడు నెలలుగా ఆమోదం పొందని ప్రతిపాదనలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



గుంటూరు నగర పాలక సంస్థలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. గత మూడు నెలలుగా కౌన్సిల్ సమావేశం జరగకపోవడం వల్ల కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన ప్రియాంబుల్స్ ఎజెండాకే పరిమితం అయ్యాయి. పాలక వర్గానికి, కమిషనర్‌కు మధ్య ఏర్పడిన అగాధం ఎప్పటికి తొలగిపోతుంది...కౌన్సిల్ సమావేశం ఎప్పుడు జరుగుతుంది...పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు ఆమోదం ఎప్పటికి లభిస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఏజెండాలో 99 ప్రశ్నలు, అభివృద్ధి పనులకు 361 ప్రతిపాదనలతో డిసెంబరు 20న జరిగిన కౌన్సిల్ సమావేశం కేవలం 23 ప్రశ్నలపై చర్చతోనే అసంపూర్తిగా ముగిసింది. తిరిగి గత నెల 4న జరిగిన కౌన్సిల్ సమావేశంలో పెద్ద ఎత్తున వివాదం చెలరేగడంతో మేయర్ కావటి మనోహర్ నాయుడు సమావేశాన్ని వాయిదా వేశారు. 99 ప్రశ్నలకు గాను గత నెల 4వ తేదీ నాటికి కేవలం 31 ప్రశ్నలపైనే చర్చ జరిగింది. తిరిగి ఈనెల 17న సమావేశం నిర్వహణకు మేయర్ కమిషనర్‌కు లేఖ రాసినా సమావేశం జరగలేదు. గత నెల 4న జరిగిన సమావేశంలో తనపై డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు అనుచితంగా ప్రవర్తించారన్న కారణంతో కమిషనర్ వ్యూహాత్మకంగా తొలుత స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు షెడ్యూలు విడుదల చేసి కౌన్సిల్ సమావేశాన్ని పెండింగ్‌లో ఉంచారు. ఈనెల 3న స్టాండింగ్ కమిటీ ఎన్నికలు ముగిశాయి. గతనెల 30న ఎమ్మెల్సీ ఎన్నికలకు షెడ్యూలు విడుదల కావడంతో ఎన్నికల

2 లో

జిజిహెచ్‌లో లైంగిక వేధింపుల కలకలం

వార్తమెయిన్‌లతో



గంజాయి స్వాధీనం చేసుకున్న రైల్వే పోలీసులు

23 కేజీల గంజాయి సీజ్

తెనాలిలో భారీగా పట్టుబడిన గంజాయి

ప్రజాశక్తి తెనాలి


జిల్లాలో గంజాయి అక్రమ రవాణా పెరుగుతోంది. శనివారం తెనాలిలో భారీ స్థాయిలో గంజాయి పట్టుబడింది. ఇప్పటి వరకు రోడ్డు మార్గంలో రవాణా చేస్తున్న అక్రమార్కులు రైళ్లల్లో కూడా రహస్యంగా తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అప్రమత్తమయ్యారు. తహసిల్దార్ కెవి గోపాలకృష్ణ సమక్షంలో స్వాధీనం చేసుకున్న 23 కేజీల గంజాయిని పోలీసులు సీజ్ చేశారు. కాగా నిందితులు అప్రమత్తమై ముందుగానే పరారైనట్లు తెలిసింది. పోలీసులు, తహశీల్దార్ వెల్లడించిన వివరాల ప్రకారం పూరి - తిరుపతి ఎక్స్ ప్రెస్ ఏ -1 కోచ్‌లో నాలుగు బ్యాగులు అనుమానాస్పదంగా ఉన్నట్లు రైల్వే పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. రైలు తెనాలిలో 3వ నెంబర్ ప్లాట్ ఫారంకు చేరుకునేసరికి రైల్వే పోలీసులు అప్రమత్తమయ్యారు. కోచ్‌లోకి వెళ్లి నాలుగు బ్యాగులను స్వాధీనం చేసుకొని ఓపెన్ చేయగా గంజాయి ఉన్నట్టుగా గుర్తించారు. దానిని సీజ్ చేసి కేసు నమోదు చేశారు. నిందితులు పరారయ్యారు. కార్యక్రమంలో రైల్వే సీఐ శ్రీనివాసరావు, జిఆర్పి ఎస్ఐ వెంకటాద్రి సిబ్బంది పాల్గొన్నారు.

మొదటి ప్రాధాన్యతా ఓటుతో గెలిపించండి

విద్యాసంస్థలలో లక్ష్మణరావు విస్తృత ప్రచారం

ప్రజాశక్తి మంగళగిరి

శాసనమండలిలో అన్ని వర్గాల ప్రజల సమస్యలను ప్రస్తావించి పరిష్కరించడానికి కృషి చేస్తానని కృష్ణ, గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుండి పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణ రావు అన్నారు. శనివారం మంగళగిరి పట్టణంలో పలు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో యుటిఎఫ్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆయన విస్తృత ప్రచారం నిర్వహించారు. మంగళగిరి పట్టణంలోని నిర్మల జూనియర్ కళాశాల, వీజెపి అండ్ డి ఎల్ బి డిగ్రీ కళాశాల, సీకే గర్ల్స్ హై స్కూల్, సికె జూనియర్ కళాశాల, వీ జె జూనియర్ కళాశాల, వీవర్స్ కాలనీలో గల మున్సిపల్ హై స్కూల్, సి.కే హై స్కూల్, పెదవడ్లపూడిలోని విజేత హై స్కూల్ తదితర ప్రాంతాల్లో ప్రచారంలో పిడిఎఫ్ అభ్యర్థికి ఘన స్వాగతం లభించింది. తొలుత నిర్మల జూనియర్ కళాశాలలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు పూల మాలవేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ శాసనమండలిని 20 07లో పునరుద్ధరించిన తర్వాత ఇప్పటివరకు 14 మంది గ్రాడ్యుయేట్,



లక్ష్మణరావుకు ఘన స్వాగతం



విద్యాసంస్థల్లో ప్రచారంలో కెఎస్ లక్ష్మణరావు

టీచర్స్ ఎమ్మెల్సీలుగా విజయం సాధించామని అన్నారు. గత 18 ఏళ్లుగా రాజ్యాంగ లక్ష్యాలకు, ఆశయాలకు కట్టుబడి పని చేస్తున్నామని, పదవీ కాలంలో నిజాయితీతో, సమాజం పట్ల నిబద్ధతతో పని చేశామని తెలిపారు. శాసనమండలిలో నిర్మాణా త్మక ప్రతిపక్షంగా ఉంటూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్స్, కార్మికులు, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, నిరుద్యోగులు, అంగన్వాడీలు, ఆశా వర్కర్లు, వైద్య ఆరోగ్య ఉద్యోగులు, కౌలు రైతులు, రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు అన్నిటిని శాసనమండలిలో పోరాటం చేశామని తెలిపారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల హక్కుల కోసం, గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు కోసం పని చేశామని తెలిపారు. త్వరలో కార్యాచరణ పొందవచ్చునని తెలిపారు. ఎయిడెడ్ సిబ్బందికి హెల్త్ కార్డులు, అనైడేడ్ సిబ్బందికి మినిమం టైం స్కేల్, కొరకు పోరాటం

2లో

వాకింగ్ ట్రాక్‌లలో కెఎస్ విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-గుంటూరు

ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల ప్రచారంలో భాగంగా పిడిఎఫ్ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావు శనివారం నగరంలోని బిఆర్ స్టేడియం, కొరిటపాడు వాకింగ్ ట్రాక్‌లలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్‌ను కలిసి పిడిఎఫ్‌ను ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. గత 14 సంవత్సరాలుగా శాసనమండలిలో ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ప్రజా సమస్యలపై గొంతెత్తి మాట్లాడానని, ప్రస్తుత ఆంధ్ర రాష్ట్ర రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ప్రజావాణి వినిపించే గొంతు అవసరమని అన్నారు. కావున ఓటర్లు అందరూ పిడిఎఫ్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు యం. కళాధర్, రాజశేఖర్, సూర్యారావు, భాస్కరయ్య, కె.నళినీకాంత్, యం.ఎ.చిష్టి, బి లక్ష్మణరావు, బి ముత్యాలరావు, కె గంగాధరరావు, ఎల్.అరుణ, మురళి, కె.సుధీర్, ఎస్ కె సమీర్, ఎస్ కార్తీక్, ఎస్. కె. ఖాశిం షహీద్, తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన అభివృద్ధి పనులు

(మొదటి పేజీ తరువాయి)

కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో ఇప్పట్లో సమావేశం జరగదని అధికార వర్గాలు తెలిపాయి. వచ్చేనెల 8వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉండటం వల్ల వచ్చే నెల 8వ తేదీ తరువాత సమావేశం నిర్వహించవచ్చునని అధికారులు చెబుతున్నారు. అయితే అనూహ్యంగా ఈనెల 3న స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో టిడిపి గెలుపొందడంతో వచ్చే నెల 17 తరువాత ఎప్పుడైనా మేయర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రతిపాదనకు రంగం సిద్ధం అవుతోంది. ఈమేరకు టిడిపి నాయకులు కసరత్తు చేస్తున్నారు. దీంతో అవిశ్వాసం కోసం ప్రత్యేక సమావేశం తప్ప ఇప్పట్లో సాధారణ సమావేశం నిర్వహిస్తారా లేదా అన్న అంశం కార్పొరేటర్లలో చర్చనీయాంశంగా మారింది. ఒక వేళ 8వ తేదీ తరువాత సమావేశం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నా సభ్యులకు వారం రోజుల ముందు నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో మార్చి 15 తరువాత సమావేశం జరిగే అవకాశం ఉందంటున్నారు. అప్పటి వరకు అభివృద్ధి పనులకు కార్పొరేషన్ ఆమోదం పొందే అవకాశం లేదు.

అగ్నిప్రమాద బాధితులకు శివశక్తి ఫౌండేషన్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - వినుకొండ

బొల్లాపల్లి మండలం ఘాటి తండాలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబానికి శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ అండగా నిలిచింది. బాధిత కుటుంబానికి వంట సామగ్రి, నిత్యావసర సరుకులు, 25 కిలోల బియ్యం, దుస్తులు, రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. వినుకొండలోని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు కార్యాలయంలో బొల్లాపల్లి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు బాధిత కుటుంబానికి సంబంధిత సాయం అందజేశారు. బొల్లాపల్లి మండలం ఘాటి తండాకు చెందిన బాబు నాయక్ నివాసం ఉంటున్న గుడిసె బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో కాలిపోయింది. విద్యుదాఘాతంతో మంటలు చెలరేగి దగ్ధమైంది. స్థానిక నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ తరపున ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో బొల్లాపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జరపాల గోవింద నాయక్, పెమ్మసాని నాగేశ్వరరావు, హనుమా నాయక్, విష్ణు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

జెపిసి నివేదికపై అభ్యంతరాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

2013 వక్ఫ్ చట్టం ను సవరణ చేయుటకు రూపొందించిన 2024 వక్ఫ్ సవరణ చట్టం బిల్లు పై కేంద్ర ప్రభుత్వం ఏర్పరిచిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) నివేదికలో ప్రతిపక్షాల అభ్యంతరాలను పట్టించుకోకుండా ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు ఏకపక్షంగా తయారుచేసిన నివేదికను పార్లమెంటుకు అందచేయడం తగదని ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షులు మహమ్మద్ కలీంపేర్కొన్నారు. ఈమేరకు శనివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఈ నివేదిక రాజ్యసభలో ఆమోదం పొందటం పై ముస్లిం సమాజం ఒకింత ఆందోళనకు గురి అవ్వడంతో పాటు పలు సంఘాల తరపున పలు విధాలుగా సామాజిక మాధ్యమాల్లో తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారన్నారు. ముస్లిం ప్రజా ప్రతినిధుల్లో కొంత మంది ప్రలోభాలకు గురి అయ్యి మరి చిన్న,చిన్న పదవులకు ఆశపడి తన జాతిని తప్పు దోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని వీరితో అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఖాళీ స్థలాలు శుభ్రంగా ఉంచుకోండి

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు నగరంలో ఖాళీ స్థలాలను వాటి యజమానులు శుభ్రంగా ఉంచుకోవాలని, లేదంటే సదరు స్థలాలలో గుంటూరు నగర పాలక సంస్థ బోర్డులు ఏర్పాటు చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజారోగ్యాధికారులను ఆదేశించారు. శనివారం కమిషనర్ ఐపిడి కాలనీ, యల్.ఆర్ కాలనీ, సంగడిగుంట, వినాయకనగర్ తదితర ప్రాంతాలలో పర్యటించి పారిశుధ్యం, అభివృద్ధి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లా డుతూ, నివాసాల మధ్యలో ఖాళీ స్థలాలు అపరిశుభ్రంగా, పిచ్చి మొక్కలతో నిండి తీవ్ర అసౌకర్యంగా ఉన్నాయని ప్రజల వద్ద నుండి పిర్యాదులు అందుతున్నాయన్నారు. వార్డు సచివాలయాల వారీగా స్థల యజమానులను గుర్తించి, స్థలాలను శుభ్రం చేసుకోవాలని నోటీసులు అందించాలని, స్పందించని యజమానుల స్థలాల్లో నగరపాలకసంస్థ బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కమిషనర్ వెంట ఎ.ఈ ఃలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మొదటి ప్రాధాన్యతా ఓటుతో గెలిపించండి

(మొదటి పేజీ తరువాయి)

చేసామని, గుంటూరు ఛానల్ పొడిగింపు కొరకు అనేక పర్యాయములు శాసన మండలి సమావేశాల్లో ప్రస్తావించడం జరిగిందని అన్నారు. నిర్మల జూనియర్ కళాశాల డైరెక్టర్ వివి ప్రసాద్ మాట్లాడుతూ ప్రతిపక్ష స్థానంలో ఉన్న వైసిపి ఆ పాత్ర పోషించకుండా అసెంబ్లీకి వెళ్లడం లేదన్నారు. ఈ తరుణంలో నిబద్ధతతో ప్రతిపక్ష పాత్ర పోషించే పిడిఎఫ్ ఎమ్మెల్సీలను గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావు రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని కోరారు. ప్రశ్నించే వారు లేకపోతే అధికారపక్షం అధికార పక్షం వారి ఇష్టానుసారం పరిపాలన చేస్తారని అన్నారు. ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ కెవిఎస్ సాయి ప్రసాద్ మాట్లాడుతూ మంగళగిరిలో 100 పడకల ఆసుపత్రి పోరాటంలో శాసనమండలిలో అనేక పర్యాయములు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ప్రస్తావించడం జరిగింది అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు పాశం రామారావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి యు రాజశేఖర్, టి ఆంజనేయులు, సీనియర్ యుటిఎఫ్ నాయకులు డి మాలకొండయ్య, ఎస్ బాలకృష్ణ, వివిధ ప్రజా సంఘాల నాయకులు జేవి రాఘవులు, వివి జవహర్లాల్, ఎస్ ఎస్ చెంగయ్య, పి బాలకృష్ణ, వై కమలాకర్, ఎస్ రామరాజు, ఎస్ రాధిక, ఎం నాగేశ్వరావు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్స్, డైరెక్టర్స్ పాల్గొన్నారు.



అరవింద సిబిఎస్ స్కూల్లో మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె ఎస్ లక్ష్మణరావు

ప్రైవేట్ టీచర్స్ గుర్తింపునకు కృషి చేస్తా

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలలో ఉన్న 1,20,000 మంది ప్రైవేట్ టీచర్లకు గుర్తింపు ఇచ్చేందుకు, వారి సమస్యల పైన కృషి పిడిఎఫ్ ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు అన్నారు. శనివారం ఎం.టి.ఎం.సి పరిధిలోని కుంచనపల్లి అరవింద హైస్కూల్, అరవింద సీబీఎస్సీ స్కూలులో టీచర్స్ ను, యుటిఎఫ్, ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఆయన ఓట్లను అభ్యర్థిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ 2007 వరకు లెక్చరర్ గా పనిచేసిన తను గత 14 సంవత్సరాలుగా ఎమ్మెల్సీగా శాసనమండలిలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్ల, అంగనవాడీలు, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు సమస్యల పైనే కాక, స్థానికంగా అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పైన ప్రజల గొంతు కై పనిచేశానన్నారు. సాధారణ ఎన్నికల కంటే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో సుమారు 25 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్న నేపథ్యంలో తాను పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని అన్నారు. ఈనెల 27వ తేదీన జరుగు ఈ ఎన్నికలలో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను అభ్యర్థించారు. ప్రచార కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం. రామారావు, యుటిఎఫ్ నాయకులు ఆంజనేయులు, డి మాలకొండయ్య, సిఐటియు తాడేపల్లి మండల నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కష్ణ, రైతు సంఘం మండల నాయకులు డోకిపర్తి రాజేంద్ర బాబు, కెవిపిఎస్ నాయకులు నాగ పోగు విజయరాజు, బుర్ర రాజు, సిఐటియు తాడేపల్లి పట్టణ నాయ కులు దొంతి రెడ్డి విజయభాస్కర రెడ్డి, పల్లె భార్గవ్, జంగం రత్తయ్య, అరవింద స్కూల్ కరస్పాండెంట్ బి ఇంద్రాణి, చాగంటి అరవింద్, అరవింద స్కూల్స్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణరావు గెలుపు కోరుతూ విస్తృత ప్రచారం



ప్రజాశక్తి-తాడేపల్లి

గుంటూరు, కృష్ణాజిల్లాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న ప్రస్తుత ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు గెలుపు కోరుతూ శనివారం తాడేపల్లి, రాజధానిలో విస్తృత ప్రచారం నిర్వహించారు. తాడేపల్లి సుందరయ్యనగర్‌లో జరిగిన ప్రచారంలో కె.గడ్డన్న, కె.కరుణాకరరావు, ఎస్‌కె బాష, కె.ప్రభాకరరావు, సిహెచ్.భుజంగరావు, ఎల్.సత్యం పాల్గొన్నారు. తాడేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో ఉపాధ్యాయులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయ వర్గం నుంచి సానుకూల స్పందన వ్యక్తమైంది. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, వేముల దుర్గారావు, ఎం.శ్రీనివాసరెడ్డి, కె.బాబూరావు తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో లక్ష్మణరావుకు ఓట్లు అభ్యర్థిస్తూ శనివారం ప్రచారం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాలు, నులకపేట, ఎర్రగడ్డ, కెసి వర్క్స్ హైస్కూల్, చైతన్య తపోవనంలోని స్కూల్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు తాడేపల్లి కార్యదర్శి వేముల దుర్గారావు, నాయకులు ఎ.శౌరిబర్తులం, బి.సూర్యప్రకాష్, అంకయ్య, ఆశీర్వాదం, వేముల రమణ, రేణుక తదితరులు పాల్గొన్నారు. రాజధానిలో భాగమైన పెనుమాకలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం.రవి, ఎస్‌కె పీరూసాహెబ్, ఎస్‌కె ఖాదర్‌బాబా తదితరులు పాల్గొన్నారు. ఉండవల్లిలో జరిగిన ప్రచారంలో ప్రజా సంఘాల నాయకులు వల్లభాపురం వెంకటేశ్వరరావు, గుంటక శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి మంగళగిరి

ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి కే ఎస్ లక్ష్మణరావు విజయాన్ని కోరుతూ వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం ప్రజాసంఘాల నాయకులు మంగళగిరి పట్టణంలో తాడేపల్లి మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం, ఆర్టీసీ బస్టాండ్, పట్టణ,రూరల్ పోలీస్ స్టేషన్, ట్రజరీ ఆఫీసు, రిజిస్ట్రార్ కార్యాలయం, పెన్షనర్స్ హెూం, తాసిల్దారు కార్యాలయం, మండల ఆఫీసు, ఎంఈఓ ఆఫీస్, ఫైర్ స్టేషన్, బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ మరియు పోస్టల్ ఆఫీస్ లలో ఉద్యోగులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు ఎస్ లక్ష్మణరావుకి వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఈమని అప్పారావు, వీసం జవహర్లాల్, ఎస్ ఎస్ చెంగయ్య, జేవీ రాఘవులు, చేనేత సంఘం నాయకులు పిల్లలమర్రి బాలకష్ణ, డోకుపర్తి రామారావు, హేమ సుందర్ రావు, సిఐటియు పట్టణ నాయకులు ఎం బాలాజీ, వై కమలాకర్, శిఖా కోటేశ్వరరావు ప్రజా సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తుళ్లూరు

ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె ఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ రాజధాని అమరావతి ప్రాంతం మందడం జడ్పీ హైస్కూల్ వద్ద శనివారం ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం భాగ్యరాజ్ మాట్లాడుతూ,కె ఎస్ లక్ష్మణరావు నిరంతరాయంగా ఉపాధ్యాయుల సమస్యలపై శాసన మండలిలో మాట్లాడడం జరిగిందని, గత ప్రభుత్వ హయాంలో పీఆర్సీకి సంబంధించిన పోరాటంలో ముందుండి పెద్ద ఎత్తున పోరాటాన్ని నిర్వహించడం జరిగిందని అన్నారు. లక్ష్మణరావును గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జానీ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - కొల్లిపర

ప్రశ్నించే గొంతు గా ఉండే ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు ను మేధావుల సభకు పంపించేందుకు ఒకటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మొలక శివ సాంబిరెడ్డి శనివారం సిఐటియు మండల కార్యదర్శి కోటా చంద్రశేఖర రావు తో కొల్లిపరలో ప్రచారం నిర్వహంచారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల : పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావును గెలిపించాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ప్రచారం నిర్వహంచారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు జెట్టి బాలరాజు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -తాడికొండ : శాసనమండలిలో అన్ని వర్గాల ప్రజల పక్షాన ప్రజా గొంతుకై వినిపిస్తున్న లక్ష్మణ్ రావును గెలిపించుకోవాల్సిన రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్ అన్నారు. లక్ష్మణరావు గెలుపు కాంక్షిస్తూ శనివారం తాడికొండ పొన్నెకల్లు మోతడక గ్రామాలలో ఈ మేరకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలలో మొదటి ప్రాధాన్యత ఓటు లక్ష్మణరావుకి వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు.పొన్నెకల్లు గ్రామంలో ఉపాధ్యాయుల మండల క్లస్టర్ సమావేశంలో పాల్గొని కరపత్రాలు పంపిణి చేసారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎడ్లపల్లి గాంధీ రామ్మోహన్రావు,రైతు సంఘం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు, దామరవరపు శ్రీనివాసరావు, చిన్నపుట్టి నాగేశ్వరరావు, రఘునందనరావు పాల్గొన్నారు



బి.ఆర్ స్టేడియంలో వాకర్స్‌తో కెఎస్ లక్ష్మణరావు

పారిశుధ్యంలో విప్లవాత్మక మార్పులకు చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు

స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ ద్వారా గుంటూరు నగరంలో పారిశుధ్యంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురానున్నామని, అందులో భాగంగా వార్డు సచివాలయాల వారీగా సూక్ష్మప్రణాళిక సిద్ధం చేశామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం బ్రాడీపేట 5వ లైన్ నుండి సీనియర్ సిటిజెన్లు, జిల్లా జైలు అధికారులు, ట్రెజరీ అధికారులతో కలిసి స్వచ్ఛతా ర్యాలీ, తాలూకా పరిసరాలలో మాస్ క్లీనింగ్, మొక్కలు నాటి, అనంతరం స్వచ్ఛతా ప్రతిజ్ఞ నిర్వహించారు. జిఎంసి ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో కలసి మాస్ క్లీనింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ త్వరలో ప్రజల సహకారంతో క్లీన్ అండ్ గ్రీన్ అండ్ హేల్తీ గుంటూరు సాకారం చేసుకుంటామన్నారు. ఇప్పటికే 57 డివిజన్ల వారీగా 809 మైక్రో పాకెట్స్‌గా విభజించి నూరు శాతం పారిశుధ్య పనులు జరిగేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. పరిశరాల పరిశుభ్రతను నగర ప్రజలు సామాజిక బాధ్యతగా తీసుకోవాలని, తడి పొడి చెత్త వేరు చేసి ప్రజారోగ్య కార్మికులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కష్ణయ్య, సిఎంఓహెచ్ డాక్టర్ అమతం, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, జిల్లా జైలు అధికారులు వీరేంద్ర ప్రసాద పాల్గొన్నారు.



చెత్తను శుభ్రం చేస్తున్న కమిషనర్, ఇతర అధికారులు

ఇంటి నుండి కంపోస్ట్ తయారు కావాలి

మునిసిపల్ కమిషనర్ బి శేషన్న

ప్రజాశక్తి తెనాలి

పట్టణ పరిధిలో ప్రతి ఇంటి నుంచి కంపోస్ట్ ఎరువు తయారు కావాలని మునిసిపల్ కమిషనర్ బి శేషన్న అన్నారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని 40 వార్డులలో 'సోర్స్ రీసోర్సు' పేరిట అవగాహనా ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని నెహ్రూ నికేతన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కమిషనర్ మాట్లాడుతూ చెత్త నుంచి సంపద సృష్టించ వచ్చునని చెప్పారు. ప్రతి ఇంటి నుంచి వెలువడే తడి పొడి చెత్త లను వేరుచేసి పొడి చెత్తను మునిసిపల్ సిబ్బందికి అందజేయాలని, తడి చెత్త నుండి హోం కంపోస్ట్ తయారు చేయాలని పిలుపునిచ్చారు. ఇంటిలోనే సేంద్రీయ ఎరువు తయారీ చేయు విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం వాసవీ అమ్మవారి దేవస్థానం వరకు విద్యార్థులతో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, హెల్త్ఆఫీసర్ డా.కె.హెలెన్ నిర్మల, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, శానిటరీ సెక్రటరీలు, నగరదీపికలు, మెప్మా సిబ్బంది చేసి విద్యార్థులు పాల్గొన్నారు.



74వ రోజు దీక్షల్లో కూర్చున్న కార్మికులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ ఖాజావలి

గంజాయి కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-తాడేపల్లి

గంజాయి కేసులో నిందితుడు తాడేపల్లికి చెందిన కట్టా రత్తయ్యను శనివారం తాడేపల్లి సిఐ బత్తుల కళ్యాణరాజు అరెస్టు చేశారు. నాలుగు సంవత్సరాల నుంచి రత్తయ్య తప్పించుకు తిరుగుతున్నాడని ఈ సందర్భంగా సిఐ తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ ఖాజావలిని అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి తెనాలి

స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సేకరించిన వివరాల ప్రకారం కొపల్లెకు చెందిన కగ్గా రవికుమార్ ప్లంబర్గా పని చేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం మోటార్ బైక్ పై వెళుతుండగా చెరుకుపల్లి వైపు నుండి బస్టాండ్లోకి వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రవికుమార్ తీవ్రంగా గాయ పడటంతో స్థానికులు ఆటోలో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరుకు తరలించారు. కాగా ప్రమాదం జరిగిన తీరుపై స్పష్టత లేదు. రవి కుమార్ వేగాన్ని నియంత్రించలేక బస్సును ఢీకొన్నట్లు స్థానికులు చెబుతుండగా, ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొందని కొందరు చెబుతున్నారు.



పెదనందిపాడులో ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్వాడి టీచర్స్, కార్యకర్తలు

అంగన్వాడి కార్యకర్తలకు శిక్షణ

ప్రజాశక్తి,పెదనందిపాడు

మండలంలోని ఉప్పల పాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో పోషణభీ పడాయిభీ మూడు రోజుల ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగం గా మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు శనివారం మూడవ రోజు ముగింపు సమావేశం జరి గింది. ఈ సందర్భంగా సిడిపిఓ సుజాత దేవి మాట్లా డుతూ ఆరు సంవత్సరాల లోపు పిల్లలలో అంగవైకల్యం గుర్తించడానికి రోల్ ప్లే కార్యక్రమాలు నిర్వహించి తద్వారా పిల్లలలో అంగవైకల్యాన్ని గుర్తించే విధంగా ఉండాలన్నారు. నవ చైతన్య, ఆధార్ శీల ద్వారా అంగన్వాడి కేంద్రాలలో పిల్లలలో కలిగే అంగవైకల్యాలను త్వరితగతిన గుర్తించి వాటిని నివారించాలని తెలియజేశారు. టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ తయారు చేసుకుని అంగన్వాడీ కేంద్రాలలో ప్రీ స్కూల్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ కె విజయలక్ష్మి కార్యకర్తల వద్ద ఫీడ్ బ్యాక్‌తో పాటు, ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా పూర్వ ప్రాథమిక విద్యను అందించడంతో పాటు నవచైతన్య, ఆధార్ శీల ద్వారా తల్లులకు అవగాహన కల్పించి అంగవైకల్యం లేని సమాజాన్ని ఏర్పరచాలని తెలియ జేశారు. అనంతరం స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా ప్రతిజ్ఞ చేయించారు.కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్లు వైరాజ్యలక్ష్మి, వి,అరుణ మండలంలోని అంగన్వాడి టీచర్స్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మేడికొండూరు

ఫిరంగిపురం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ మెడికొండూరు సెక్టార్ అంగన్వాడీ కార్యకర్తలకు మూడు రోజులు పోషన్ బి పడాయి భీ శిక్షణ కార్యక్రమం శనివారం మేడికొండూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో ముగిసింది. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ టి హేమలత భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు పిల్లల శారీరక, మానసిక ఎదుగుదల ఎంతో ముఖ్యమని, ప్రతి వ్యక్తి మొదటి ఆరేళ్లలో మెదడు 85 శాతం పెరుగుదల జరుగుతుందన్నారు. సీడీపీఓ ప్రసూన మాట్లాడుతూ ఈ పోషణ్ భీ పడాయి భీ ట్రయినింగ్ ద్వారా అంగన్వాడీ టీచర్ ల సామర్థ్యాలను పెంపొందించి 0 నుండి 6 సంవత్సరాల పిల్లలు పునాది అభ్యసన సామర్థ్యాలను మెరుగు పరచటానికి దోహదపడుతుంది అని తెలియ చేసారు. దివ్యంగ పిల్లల స్క్రీన్నింగ్ వారి హక్కులు, వ్యూహాలు, దివ్యంగా పిల్లల గృహ సందర్శనాలు పెంపకం, వారి సంరక్షణ వివిధ విషయాల ను చర్చించారు. శిక్షణ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకాకాని

చిన్నారుల పోషణ, ఎదుగుదల గురించి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పోషణ భీ పడాయి భీ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని వెనిగండ్ల,నంబూరు గ్రామాల్లోని అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ ఎస్ డి పి ఒ వెంకటరమణ మాట్లాడుతూ అప్పుడే పుట్టిన శిశువు నుండి ఆరు సంవత్సరాల పిల్లల వరకు అంగన్వాడీలు వారి గృహాలను సందర్శించి శిశువు పోషణ ఎదుగుదలకు విద్యాభ్యాసం వంటి అంశాలపై గృహిణులకు అవగాహన కల్పించి అవసరమైన వారికి వైద్య పరీక్షలు నిమిత్తం డైక్ సెంటర్లకు పంపించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ఐసిడిఎస్ అధికారులు అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



74వ రోజు దీక్షల్లో కూర్చున్న కార్మికులు

ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి

ప్రజాశక్తి-తాడేపల్లి

ఎసిసి సిమెంటు ఫ్యాక్టరీ కార్మికుల న్యాయమైన పోరాటంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని కార్మికులకు న్యాయం చేయాలని నాయకులు కోరారు. కార్మికులు చేస్తున్న దీక్షలు శనివారం నాటికి 74వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, బి.సూర్యప్రకాష్ ప్రారంభించారు. దీక్షల్లో ఎన్.సుబ్బారావు, కె.అగ్గయ్య, ఎస్‌కె ఇస్మాయేలు, ఆదినారాయణ, వై.యొహోషువా కూర్చున్నారు. దీక్షలను ప్రారంభించిన దుర్గారావు మాట్లాడుతూ కార్మికుల సమస్యను ప్రభుత్వం పరిష్కరించకపోతే మూల్యం చెల్లించకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, అక్కయ్య, ఎం.గురవయ్య, శారమ్మ, వై.రమాదేవి, లక్ష్మి, డి.రమణ, ఎస్‌కె ఇమామ్‌బి, శివకుమారి, దుర్గాభవాని, సులేమాన్ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో, ఎంఇఒ, విద్యార్థులు

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యం

ప్రజాశక్తి-ఈపూరు

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా గ్రామాలలో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ఎంపీడీవో కె ప్రభాకర్ రావు అన్నారు. మండలంలోని స్వచ్ఛత దినోత్సవంలో భాగంగా ముప్పాళ్ళ గ్రామంలో విద్యార్థులతో కలిసి అధికారులు స్వచ్ఛ స్వర్ణాంధ్ర సాధిద్దాం అంటూ శనివారం ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఇన్చార్జి ఈఓపిఆర్డి నాగేండ్ల రత్నం మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అన్నారు. ఇంటి పరిసరాలను ప్రతి ఒక్కరు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ర్యాలీలో ఎంఈఓ రామ తులసి, ప్రధానోపాధ్యాయులు సాంబ నాయక్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మిట్టపల్లికళాశాలలో ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి ప్రత్తిపాడు

ప్రత్తిపాడు మండల పరిధిలోని తుమ్మలపాలెం గ్రామంలోని శ్రీ మిట్టపల్లి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (అటానమస్) కళాశాలలో శనివారం జాతీయ స్థాయి ఎపిసిటిఇ ట్రైనింగ్ అండ్ లెర్నింగ్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం విజయవంతంగా ముగిసింది. శ్రీ మిట్టపల్లి కళాశాలలో ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకు ఆరు రోజులపాటు ఆన్‌లైన్లో ట్రైనింగ్ అండ్ లెర్నింగ్ అకాడమి ప్రాయోజితంతో విజయ వంతంగా నిర్వహించారు. ఈ వర్క్‌షాప్ ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, వాటి ఉపయోగాలు అనే అంశంపై లోతైన అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమంలో మొత్తం 246 మంది అధ్యాపకులు, రిసెర్చ్ స్కాలర్స్, వివిధ రాష్ట్రాల నుండి పాల్గొన్నారు. కార్యక్రమం గురించి కళాశాల ప్రిన్సిపాల్ .ఎస్.గోపి కృష్ణ మాట్లాడుతూ అధ్యాపకులు కొత్త టెక్నాలజీలను అర్థం చేసుకోవడంతోపాటు విద్యార్థులకు మెరుగైన బోధన అందిచగలుగుతారని పేర్కొన్నారు. కళాశాల సెక్రటరీ ఎం.బి.వి సత్యనారాయణ ముఖ్య ఉద్దేశాన్ని వివరించి, ఇందుకు సహకరించి విజయవంతం చేసిన ప్రొఫెసర్స్‌ని, ఇంజనీర్స్‌ని, కళాశాల అధ్యాపక బృందాన్ని ప్రశంసించారు.

శాసనమండలిలో ప్రజాగొంతుక లక్ష్మణరావు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

శాసనమండలిలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాల తరపున బలమైన వాణి వినిపించే ఏకైక వ్యక్తి కేఎస్ లక్ష్మణరావు అని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ అన్నారు. స్థానికంగా ఉన్న పలు ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, పట్టభద్రులను కలిసి మొదటి ప్రాధాన్య ఓటును కేఎస్ లక్ష్మణరావుకు వేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ సంఘాల సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వానికి ప్రజల కోణం నుంచి కొన్ని విలువైన సలహాలు, సూచనలు చేయడానికి, పాలకవర్గం చేసే అనేక చట్టాలలో మంచి చెడులను విశ్లేషించడానికి ఎమ్మెల్సీ స్థానం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సలహాలను పరిగణనలోకి తీసుకునే ప్రభుత్వమైతే ఇలాంటి చోట్ల రాజకీయ పార్టీ అభ్యర్థులను పోటీలోకి పెట్టబోదని తెలిపారు. కూటమి ప్రభుత్వం మాత్రం గ్రాడ్యుయేట్ స్థానంలో కూడా తమ అభ్యర్థిని పోటీలో పెట్టిందని విమర్శించారు. ఆరు జిల్లాల్లో 33 నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఆరుగురు పార్లమెంటు సభ్యులు, కూటమి పార్టీల అగ్రనాయకులంతా ఒక ఎమ్మెల్సీని ఓడించడానికి సన్నద్ధమైన తీవ్ర ప్రయత్నం చేస్తున్నారన్నారు. అధికార దర్పాన్ని సైతం ప్రదర్శిస్తున్నారన్న రు. గత ప్రభుత్వం ఏదైతే 175 స్థానాలు తమకే రావాలని.. ప్రశ్నించే వారు ఉండకూడదని కోరుకుందో... ఇప్పుడు ఈ ప్రభుత్వం కూడా అదే దారిలో పయనిస్తోందని విమర్శించారు. చైతన్యం కలిగిన గ్రాడ్యుయేట్ ఓటర్లు స్వతంత్రంగా ఆలోచించి మంచి నిర్ణయం తీసుకుంటారని ఆకాంక్షించారు. 14 సంవత్సరాల పాటు ఎమ్మెల్సీగా ఉండి, నిజాయితీతో మచ్చలేకుండా పనిచేసిన కె.ఎస్.లక్ష్మణరావుకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. అన్ని తరగతుల యూనియన్లలో ఉన్న పట్టభద్రులంతా ఆలోచించి రాజకీయాలకు అతీతంగా తమ ఓటు హక్కు ను ఉపయోగించుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని.. పాలక పార్టీ వాణితో పాటు ప్రజలవాణిని మండలిలో వినిపించే పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.




కేఎస్ లక్ష్మణరావుకు మద్దతుగా ప్రచారం చేస్తున్న నాయకులు

ప్రశ్నించే గళం కేఎస్..

వినుకొండ : నిరంతరం అన్ని వర్గాల ప్రజా పక్షాన నిలిచి.. చట్టసభల్లో సమస్యలపై ప్రశ్నించి, గళం విప్పే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావును గెలిపించుకోవాలని కోరుతూ వినుకొండలో సిఐటియు నాయకులు శనివారం ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని తహసీల్దారు, సబ్ రిజిస్ట్రార్, ట్రెజరీ, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో అధికారులను, ఉద్యోగులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు కేఎస్ లక్ష్మణరావుకు వేసి.. వేయించి గెలిపించాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, నిరుద్యోగులు, సామాన్య, మధ్య తరగతి ప్రజల ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై నిరంతరం శాసనమండలిలో ప్రశ్నించి, పోరాడుతున్న వ్యక్తి లక్ష్మణరావు అని తెలిపారు. ప్రతి ఉద్యోగికీ కరపత్రం పంచుతూ ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. ప్రచారంలో సిఐటియు నాయకులు కె. హనుమంత్ రెడ్డి, శివరామకృష్ణ, వెంకటప్పయ్య, రోడ్డ వెంకటరెడ్డి, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హెల్మెట్, సీటు బెల్టుతో ప్రాణాలకు రక్షణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీటు బెల్టు ధరించి ప్రయాణం చేయాలని, తద్వారా ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలకు రక్షణ ఉంటుందని జిల్లా రవాణాశాఖ అధికారి జి.సంజీవ్ కుమార్, నరసరావుపేట డిఎస్‌పి నాగేశ్వరరావు అన్నారు. 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం నరసరావుపేట పట్టణం పల్నాడు రోడ్డు హీరో షోరూమ్ వద్ద నుంచి పట్టణంలో ప్రధాన వీధుల్లో 200 మందికి పైగా సిబ్బందితో ద్విచక్ర వాహనాలపై హెల్మెట్ ధరించి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డి.ఎస్.పి కె.నాగేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ అధికారి సంజీవ్ కుమార్ మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల సమయంలో ప్రాణహాని ఉండదన్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, ఎవరైనా మైనర్ వాహనంతో రోడ్డెక్కితే వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనం నడిపితే 6 నెలల జైలు శిక్ష ఉంటుందని హెచ్చరించారు. అతివేగం, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వలన ఎక్కువ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. డి.ఎస్.పి కె.నాగేశ్వరరావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాద మరణాలను తగ్గించాలంటే ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాద రహిత ప్రయాణం చేయాలని సూచించారు. అనంతరం వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వాహన తనిఖీ అధికారులు ఎన్ శివ నాగేశ్వరావు, సిహెచ్ రాంబాబు ,కె.ఎల్ రావు, డి.శేషు రెడ్డి, సిహెచ్ మనీషా, వంశీకష్ణ, ట్రాఫిక్ సిఐ లోకనాథం, ఎస్ఐ వేణు, రోడ్ సేఫ్టీ డాక్టర్ నవ్య, హాజరత్తయ్య, ఆర్టీసీ సిబ్బంది, ఈశ్వర్, ఎన్.ఈ.సి, జె.ఎన్.టి.యు.కె కళాశాలల విద్యార్థులు వాలంటీర్లు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో సత్తా చాటిన మాచర్ల శ్రీచైతన్య విద్యార్థులు

ప్రజాశక్తి- మాచర్ల

ఆల్ ఇండియా ఒలింపియాడ్ (నాలెడ్జ్ అసెస్మెంట్ టెస్ట్) పరీక్షా ఫలితాల్లో పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. జిల్లా కేంద్రమైన నర్సరావుపేటలో డిసెంబర్‌లో జరిగిన పరీక్షల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులను శనివారం పాఠశాల ప్రిన్సిపాల్ అయ్యప్పరెడ్డి హరణి, డీన్ అనిల్‌కుమార్, సి బ్యాచ్ ఇన్‌చార్జి శివల అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒలింపియాడ్ పరీక్షల్లో ప్రతిభ చాటిన 57 మంది విద్యార్థుల్లో ఆరుగురికి నగదు బహుమతి, మెరిట్ సర్టిఫికెట్, మెడల్స్, 23 మంది మెడల్స్, మెరిట్ సర్టిఫికేట్స్, 28 మంది మెరిట్ సర్టిఫికేట్లు సాధించారన్నారు. నేషనల్ లెవల్ పరీక్షల్లో మాచర్లకు చెందిన పాఠశాలల విద్యార్థుల్లో ఇంతటి ప్రతిభ చాటింది తమ విద్యార్థులేనని చెప్పారు. ఉపాధ్యాయులు కృషి, విద్యార్థుల క్రమశిక్షణ, పట్టుదలే విజయానికి కారణమన్నారు. విద్యార్థులను అభినందించిన వారిలో శ్రీచైనత్య పాఠశాల పల్నాడు ఏజిఎం ఎన్.అంజయ్య, రీజనల్ ఇన్‌చార్జి సి.హెచ్. సురేంద్ర, పాఠశాల కోర్డినేటర్లు కె.శ్రీనివాసరావు, సి-బ్యాచ్ కోఆర్డినేటర్ జె.రంగారావు, ఉపాధ్యాయులు అరుణ, ఆంజనేయులు, రాజేష్, శ్యామ్, గిరీష్ తదితరులున్నారు.



పెండింగు కేసులకు సత్వర పరిష్కారం : ఎస్పీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

న్యాయం జరుగుతుందని పోలీసు వ్యవస్థ పట్ల నమ్మకంతో స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలని.. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి మెరుగైన న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు పోలీసు సిబ్బందికి సూచించారు. నరసరావుపేటలోని జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఎస్పీ నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, బాలికలు, చిన్నారుల ఫిర్యాదులపై వేగంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోక్సో కేసులు, చోరీలు, మిస్సింగ్ కేసుల దర్యాప్తు త్వరగా పూర్తి చేయాలన్నారు. పోలీస్ స్టేషన్‌లను ఆశ్రయించే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, సున్నితమైన భాషతో మాట్లాడాలన్నారు. వారితో మమేకమై సమస్యలను ఓపికగా వినాలన్నారు.

కోటప్పకొండ వద్ద పటిష్ట బందోబస్తు

ఈ నెలలో 26 న పల్నాడు జిల్లాలో మహాశివరాత్రి సందర్భంగా ముఖ్యంగా కోటప్పకొండ అమరావతి, సత్రశాల, దైద శివాలయాల వద్ద భక్తుల రద్దీ నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఎస్పీ వివరించారు. 112 నుంచి వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, సకాలంలో ఘటనా స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదు అందిన సమయం నుంచి సంఘటన స్థలానికి చేరుకున్న సమయాన్ని పరిగణనలోకి తీసుకొని నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీలు, సస్పెక్ట్‌లు, పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, క్రయ విక్రయాలపై కఠినంగా వ్యవహరించాలన్నారు. జిల్లాలో గంజాయి నిర్మూలించడానికి కొన్ని ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వాటిని అరికట్టే దిశలో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్.పి (అడ్మిన్) జె.వి.సంతోష్, నరసరావుపేట, సత్తెనపల్లి, గురజాల డి.ఎస్.పిలు కె.నాగేశ్వరరావు, ఎం.హనుమంతరావు, జగదీష్, నరసరావుపేట మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్.పి వెంకటరమణ, ఎస్‌బి సిఐ బి.సురేష్ బాబు పి.శరత్ బాబు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ

ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలంలోని కేసానుపల్లి గ్రామ పరిధిలో గల ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా సాగాయి. జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభించిన చైర్మన్ రామ శేషగిరిరావు మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో కళాశాలలో ఏర్పడిన పరిచయాలు స్నేహపూర్వక బంధాలు ఎల్లకాలం నిలిచి ఉంటాయన్నారు. విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకుని లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన గుంటూరు జెకెసి కళాశాల హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ నాగ సుశీల మాట్లాడుతూ ఆత్మస్థైర్యం, ఆత్మ విశ్వాసంతో లక్ష్య సాధన సులభంగా ఉంటుందన్నారు. విద్యార్థులు నీతి, నిజాయితీ, క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కళాశాల డైరెక్టర్లు దరువురి శ్రావ్య, డాక్టర్ సాయి పవన్ మాట్లాడుతూ ఫార్మసీ రంగం అనేది మందులు, వైద్యం, ఆరోగ్యం రంగంలో కీలకమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ప్రసాదరావు, ఎంఏఎం లా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వీర బ్రహ్మం చౌదరి తదితరులు పాల్గొన్నారు.





భర్తను కిడ్నాప్ చేశారని హెచ్‌సీపై ఫిర్యాదు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తన భర్త కనిపించకుండా పోవడానికి కారణమైన దాచేపల్లి పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ రామ సుబ్బారావుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాధవి అనే వివాహిత నరసరావుపేట జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీకి శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడారు. నడికుడి ఎస్.బి.ఐ లో గోల్డ్ అప్రయిజర్ గా పని చేస్తున్న పని చేస్తున్న తన భర్త చేపూరి పూర్ణ చంద్రరావు.. గత ఏడాది ఆగస్టులో హెడ్ కానిస్టేబుల్ రామ సుబ్బారావు వద్ద రూ.3 లక్షలు రూ రోజుకు రూ.3 వేలు చెల్లించేలా ఒప్పందం చేసుకుని అప్పు తీసుకున్నారని తెలిపారు. 20 రోజుల వ్యవధిలో రూ.1 లక్ష నగదు చెల్లించారని చెప్పారు. ఇంకా చెల్లించాల్సిన నగదు చెల్లించేందుకు కొంత సమయం కావాలని అడిగినప్పటికీ.. వడ్డీ డబ్బులు కట్టాలని కానిస్టేబుల్ వేధింపులకు పాల్పడినట్లు ఆమె వాపోయారు. వేధింపులు తాళలేక నరసరావుపేట బంధువుల వద్ద తలదాచుకున్న పూర్ణ చంద్రరావును 10 రోజుల క్రితం కానిస్టేబుల్ సుబ్బారావు కిడ్నాప్ చేశారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. తన మామ వీరయ్యను కూడా దాచేపల్లి స్టేషన్ కు తీసుకువెళ్లి 4 రోజుల పాటు చిత్ర హింసలకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేసింది. ప్రస్తుతం గురజాల డి.ఎస్.పి కార్యాలయంలో ఆయన పని చేస్తున్నారని, అతని పై చర్యలు తీసుకొని భర్త ఆచూకీ కనిపెట్టాలని ఎస్.పికి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్.పి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

8న జాతీయ లోక్‌అదాలత్

ప్రజాశక్తి- మాచర్ల రూరల్ : జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్, సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తులు ఎస్.శ్రీనివాసకళ్యాణ్, పి.ప్రశాంత్ కోరారు. మాచర్ల కోర్టు ఆవరణలో మార్చి 8వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాజీమార్గమే రాజ మార్గమని, కేసు గెలిస్తే ఒక్కరే గెలుస్తారని, రాజీ పడితే ఇరువైపులా గెలుస్తారని చెప్పారు. లోక్ అదాలత్‌లో అన్ని రకాల సివిల్ కేసులు, భరణం, గృహ హింస, బ్యాంక్ కేసులు, రాజీ చేయదగిన క్రిమినల్ కేసులు, ముందుస్తు రాజీ చేసుకోదల్చిన కేసుల్లో ఇరు పక్షాల మధ్య సామరస్య పూర్వకంగా రాజీ చేసి పరిష్కారం లభిస్తుందని చెప్పారు. మాచర్ల న్యాయస్థానాల పరిధిలోని కక్షిదారులు మార్చి 8వ తేదీన స్థానిక కోర్టు ఆవరణలో జరిగే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



చెత్తను శుభ్రం చేస్తున్న జేసీ, ఇతర అధికారులు

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

జిల్లా సంయుక్త కలెక్టర్ భార్గవ తేజ

ప్రజాశక్తి-గుంటూరు

పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరు వ్యక్తిగత బాధ్యతగా చేపట్టాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ తేజ అన్నారు. శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం లో భాగంగా జిల్లా కలెక్టరు కార్యాలయంలో జరిగిన స్వచ్ఛత కార్యక్రమాలలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఏ. భార్గవ తేజ , జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి, జిల్లా అధికారులతో కలిసి కలెక్టరేట్ ప్రాంగణంలో చెత్త, వ్యర్థాలను తొలగించి, పరిసరాల శుభ్రం చేశారు. పౌర సరఫరాల కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. పరిశుభ్రత కార్యక్రమాలను నిరంతరం పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యాలయాలను, పరిసర ప్రాంగణాలను శుభ్రంగా ఉండేలా అధికారులు ప్రణాళిక ప్రకారం స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో పూర్ణ చంద్రరావు, మత్స్య శాఖ డిడి గాలిదేముడు, డీపీఓ సాయికుమార్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవీందర్, జిల్లా భూగర్భ జలవనరులశాఖ ఉపసంచాలకులు వందనం, కలెక్టరేట్ సెక్షన్ సూపరిండెంట్లు, అధికారులు పాల్గొన్నారు.

పిల్లల సంరక్షణ బాధ్యత అందరిదీ

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి ఎం బబిత

ప్రజాశక్తి - తుళ్లూరు

పిల్లల సంరక్షణ బాధ్యత అందరిదని రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి ఎం బబిత అన్నారు.రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ప్యాట్రన్ - ఇన్ - చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్,ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ రవినాథ్ తిలహరి సూచనల మేరకు బాలలపై జరుగుతున్న లైంగిక నేరాలపై అవగాహన కోసం శనివారం రాజధాని అమరావతి పరిధిలోని శాఖమూరు గ్రామం లో విట్ యూనివర్సిటీ న్యాయ విద్యార్థులు ఇంటింటి సర్వే నిర్వహించారు. కార్యక్రమాన్ని బబిత జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భం గా జరిగిన కార్యక్రమంలో బబిత మాట్లాడుతూ చిన్న పిల్లలపై లైంగిక దాడులు, అఘాయిత్యాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అభం శుభం తెలియని చిన్నారులకు చెడు స్పర్శ, మంచి స్పర్శ గురించి అవగాహన కల్పించటం ఆవసరమని ఆమె పేర్కొన్నారు. వీరి రక్షణ కోసం బాలలపై లైంగిక వేధింపుల నివారణ చట్టం (ఫోక్సో) 2012 వచ్చిందని, ఎవరైనా ఈ తరహా నేరాలకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయని ఆమె వివరించారు.బాలలపై నేరాలు తగ్గించటానికి అందరిలో ఆవగాహన కల్పించటం అవసరమని తెలిపారు. తదనంతరం, గుంటూరు జెడ్పిపి డిప్యూటీ సిఈఓ సిహెచ్ కృష్ణ మాట్లాడుతూ సోషల్ మీడియా ప్రభావం వల్ల పిల్లలపై లైంగిక నేరాలు పెరుగుతున్నాయని, వీటికి దూరంగా ఉండేలా అందరికీ అవగాహన కర్పించాలని ఆయన అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఉప కార్యదర్శి. హెచ్ అమర రంగేశ్వరరావు మాట్లాడుతూ ఎవరికైనా న్యాయ సహాయం కావాలంటే 15100 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి న్యాయ సహాయం పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ సహాయ కార్యదర్శి ఎన్ జేజేశ్వరరావు, విట్ కళాశాల ప్రిన్సిపాల్ బెనర్జీ, లీగల్ ఎయిడ్ ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్, ప్రొఫెసర్ జి మాళవిక, ఎంపీడీవో కె శిల్పా,పంచాయతి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



ఇంటింటి సర్వే ను జెండా ఊపి ప్రారంభిస్తున్న బబిత



తేజో తన్మయని అభినందిస్తున్న జెనెసిస్ అకాడమి డైరెక్టర్

జెఈఈ మెయిన్స్‌లో వెలగ తేజో తన్మయకి 99.56 శాతం మార్కులు

ప్రజాశక్తి ప్రత్తిపాడు:

జెఈఈ మెయిన్స్ ఫేజ్ -1 2025 ఫలితాల్లో డా.బి.ఆర్.ఆర్ జెనెసిస్ అకాడమి కానూరు విజయవాడలో సీనియర్ ఎంపిసి విద్యార్థి వెలగ తేజో తన్మయ 99.56 శాతం మార్కులు సాధించడం పట్ల డైరెక్టర్ బి.రాజా రత్నం హర్షం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ తేజోతన్మయ తన విద్యాభ్యాసం అతా ప్రత్తిపాడు మండల కేంద్రంలోని అక్షయ విద్యాలయంలో పూర్తి చేసుకుందన్నారు. జెఈఈ మెయిన్స్ ర్యాంకులను పెద్ద పెద్ద కార్పొరేట్ పాఠశాల విద్యార్థులు మాత్రమే సాధిస్తారనుకుంటారనీ, అయితే ఆ అభిప్రాయం తప్పని తేజో తన్మయ నిరూపించిందన్నారు. మండల కేంద్రంలోని పాఠశాలలో చదివి ఇంతటి పర్సంటేజ్ సాధించటం పట్ల అక్షయ విద్యాలయం చైర్మన్ వెలగ రాఘవయ్య చౌదరి డైరెక్టర్ శ్రీవల్లి మరియు ప్రిన్సిపల్ సాగర జ్యోతి ఉపాధ్యాయులు విద్యార్థులు అభినందనలు తెలిపారు.

అసమానతలను తగ్గించేందుకు సేవా సంస్థలు ముందుకు రావాలి

ప్రజాశక్తి-గుంటూరు

భారత సమాజంలో ఉన్న ఆర్థిక అసమానత లను తగ్గించడానికి గ్రేస్‌లైఫ్ ఫౌండేషన్ లాంటి వేలాది సంస్థలు ముందుకు రావాలని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అన్నారు. శనివారం బ్రాడీ పేటలోని కొరటాల మీటింగ్ హాల్‌లో ఫౌండేషన్ 6వ వార్షి కోత్సవ సమావేశంలో లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ స్థూల జాతీ యోత్పత్తిలో ఇండియా ప్రపంచంలో 5వ స్థానంలో ఉండగా, మరొకవైపు మానవ వనరుల అభివృద్ధి సూచికలో 134వ స్థానంలో ఉండటం దురదృష్టకరమన్నారు. భారతదేశంలో కేవలం ఒక్క శాతం ప్రజల చేతుల్లో 40శాతం సంపద, 22 శాతం ఆదాయం కలిగి ఉన్నారని, మరొకవైపు అట్టడుగున ఉన్న 50 శాతం ప్రజల చేతుల్లో కేవలం 10 శాతం మాత్రమే సంపద ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో గ్రేస్ లైఫ్ ఫౌండే షన్ లాంటి సంస్థల కృషి అవసరమన్నారు. గుంటూరు నగరంలో కార్మెల్ సేవాసదన్, రుద్ర చారిటబుల్ ట్రస్ట్, కోవిడ్ ఫైటర్స్, అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్, అమ్మ హెల్పింగ్ ఫౌండేషన్, కెబిఆర్ ఫౌండేషన్, విజయ బ్లడ్‌ట్రస్ట్, మాన వత, నేస్తం లాంటి సంస్థలు బహుముఖ సేవా కార్య క్రమా లను నిర్వహించటం అభినందనీయమన్నారు. గ్రేస్ లైఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు విట్సన్ పాల్ మాట్లాడుతూ గత 6 సంవత్సరాలుగా అతినిరు పేదలకు పౌష్టికాహారం అందిస్తూ, వైద్య శిబిరాలు, నిర్వహిస్తూ రక్తదానం పట్ల అవ గాహన కార్యక్రమాలు, అవయవ దానంపై అవగాహన కల్పి స్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సామాజిక సేవలో కషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థల బాధ్యులను సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన రక్తదాన కార్యక్రమంలో 20 మంది యువత స్వచ్ఛందంగా విజయ బ్లడ్ ట్రస్ట్‌కు రక్తదానం చేశారు. కార్యక్రమంలో బహుజన సేవా సమితి అధ్య క్షులు భగత్ సింగ్, గ్రేస్ విక్టర్ సీడ్స్ అధినేత ఇజ్రాయిల్, జాన్సన్, అన్ని అబ్రాడ్ సీఈవో వివేక్‌రాజ్, నేస్తం సహ వ్యవస్థాపకులు టి. ధనంజయ రెడ్డి, శివ ప్రసంగించారు.





సమావేశంలో మాట్లాడుతున్న సిఐ, ఎస్ఐ

అత్యాచారం కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి, పెదనందిపాడు:

ఇటీవల పెదనందిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద జరిగిన వద్ధ మహిళ అత్యాచారం, హత్య కేసులో ఇద్దరు ముద్దాయిలు పాలపర్తి మంజు, పాలపర్తి సాంబను శనివారం అదుపులోకి తీసుకున్నట్లు పత్తిపాడు సిఐ శ్రీనివాసరావు, పెదనందిపాడు ఎస్సై మధు పవన్ విలేకరులకు తెలిపారు. ముద్దాయిల కోసం మూడు బృందాలతో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టినట్లు వివరించారు. నిందితులు గతంలో కూడా ఒంటరి మహిళలపై అత్యాచారం చేసి చంపిన కేసుల్లో జైలుకు కూడా వెళ్లారని తెలిపారు. నిందితుడు పాలపర్తి మంజు ఫిబ్రవరి ఒకటో తారీకు జైలు నుండి విడుదలై గ్రామానికి వచ్చినట్లు తెలిసిందన్నారు. ముద్దాయిలను విచారించగా తాము ఇద్దరం సొంత అన్నదమ్ములమని, చెడు అలవాట్ల బానిసలై నేరాలకు పాల్పడుతున్నట్లు వారు అంగీకరించారని తెలిపారు. ముద్దాయిలు ఇద్దరినీ అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరుస్తామని పోలీసులు తెలిపారు. ముద్దాయిలను అరెస్టు చేయడంలో విశేష కృషి చేసిన పత్తిపాడు సిఐ జి శ్రీనివాసరావు, పెదనందిపాడు ఎస్ఐ ఏ.మధుపవన్‌ను ఎస్పీ సతీష్ కుమార్ అభినందించారు.

వ్యక్తిపై విచక్షణా రహితంగా దాడి

- పోలీసుల అదుపులో యువకులు?

ప్రజాశక్తి తెనాలి

వ్యక్తిని అక్రమంగా నిర్బంధించి అతనిపై విచక్షణా రహితంగా దాడి చేసి కారులో తరలిస్తుండగా పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని బాధితుడిని ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. సేకరించిన వివరాల ప్రకారం నందుల పేటకు చెందిన మణి గతంలో హైదరాబాదులో ఉండగా అతడి వద్ద కాకినాడకు జిల్లా పెద్దాపురంకు చెందిన సతీష్ పనిచేశాడు. జీతం వ్యవహారంలో ఇరువురి మధ్య వివాదం నెలకొని, పరస్పరం వాగ్వివాదం జరిగింది. దాన్ని దృష్టిలో ఉంచుకున్న మణి జీతం చెల్లిస్తానంటూ సతీష్‌ను నమ్మబలికి, విజయవాడకు పిలిపించి కార్ ఎక్కించుకొని తెనాలి తీసుకువచ్చినట్లు తెలిసింది. మణితోపాటు మరో ఇరువురితో కలిసి అతనిపై దాడికి పాల్పడినట్లు సమాచారం. శుక్రవారం రాత్రి పట్టణ శివారు ప్రాంతంలో కారును గుర్తించిన త్రీ టౌన్ పోలీసులు వారిని విచారించగా విషయం బయటకు పొక్కటంతో నిందితులను అదుపులోకి తీసుకుని బాధితుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది.

సూపర్ 6ని గాలికి వదిలిన ప్రభుత్వం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఎన్నికల ముందు హామీలు గుప్పించి... ఆ తర్వాత హామీలను గాలికి వదలడం ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని ఈ క్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికలలో అధికార పార్టీ అభ్యర్థులకు తగిన గుణపాఠం చెప్పాలని ప్రజా సంఘాల జిల్లా నాయకులు ఈమని అప్పారావు పిలుపునిచ్చారు. మండలంలని కాజా గ్రామంలో రైతు సంఘం గ్రామ కార్యదర్శి భీమవరపు లక్ష్మారెడ్డి 21వ వర్ధంతి సభ జరిగింది. సభకు ఎస్ కోటిరెడ్డి అధ్యక్ష వహించారు. తొలిత లక్ష్మారెడ్డి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రైతు సంఘ నాయకులుగా రైతాంగ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన ఆయన స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. రైతులు వ్యవసాయ కార్మికులు ప్రజల సమస్యలపై మండలిలో గళ మెత్తె ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావుకు మరొకసారి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి వంతపాడుతుంది తప్ప హామీలు అమలకు కృషి చేయడం లేదన్నారు. రాజధానికి నిధులు లేవని రైల్వే జోన్ లేదని పోలవరం ప్రాజెక్టుకు నామమాత్రపు కేటాయింపులేనని ఈ సందర్భంగా పేర్కొన్నారు. పోలవరం నిర్వాసితులను ఆదుకోవడానికి ఎటువంటి కేటాయింపులు లేవన్నారు. ప్రశ్నించే గొంతుక ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు అని, ఆయనను గెలిపించి శాసనమండలికి పంపించాల్సిన ఆవశ్యకతను వివరించారు. ప్రజలంతా ఎమ్మెల్సీ లక్ష్మణరావు మరొకసారి గెలిపించి శాసనమండలికి పంపాలన్నారు. కార్యక్రమంలో భీమిరెడ్డి కోటేశ్వరి, తమ్మా ప్రసాద్ రెడ్డి, సింహాద్రి సుమ, ఈదా ప్రతాపరెడ్డి, నరసింహారావు, సింహాద్రి ఆదిశేకర్, నిర్మల, భీమవరపు తిరుమల పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న నాయకులు

స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర సాధిద్దాం

● వ్యర్థాల నుంచి సంపద సృష్టి దిశగా అడుగులు వేద్దాం : కలెక్టర్ ● కార్యాలయాలను శుభ్రం చేసిన అధికారులు, ఉద్యోగులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన స్వచ్ఛంద్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర.. స్వర్ణ ఆంధ్ర ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఒక మంచి ఉద్దేశంతో అధికారులను, సిబ్బందిని, ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఇదే స్ఫూర్తితో పరిసరాల శుభ్రత పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్ ఫైల్స్ పరిష్కారం అయ్యేలా చూడాలని.. తద్వారా ప్రజలకు సత్వర సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెల 3వ శనివారం తప్పనిసరిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. తడి, పొడి చెత్త సేకరణ కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహించాలని, ఆ మేరకు ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే ధనుంజయ్, జిల్లా రెవెన్యూ అధికారి మురళి, కలెక్టరేట్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీజెన్‌కో ఆధ్వర్యంలో..

విజయపురిసౌత్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని నాగార్జున సాగర్ ఏపీజెన్కో ఆధ్వర్యంలో విజయపురిసౌత్‌లో నిర్వహించారు. జెన్‌కో ఈఈ అప్పాజీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తొలుత ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఏపీ జెన్కో క్వార్టర్స్ వద్ద రోడ్లను చీపుర్లతో ఊడ్చి శుభ్రం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈలు రాజారెడ్డి, అక్బర్, రమణారావు, ఏఈలు గౌతమ్, శ్రీను, శ్రీనివాస్, రేవతి, సల్మా, రాణిబాయి, మనోహరమ్మ, రాణి, ఎస్పీఎఫ్ ఏఎస్ఐ సత్యమూర్తి, డాక్టర్ రేవంత్, ఉద్యోగులు చందు, రామకృష్ణ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

జల వనరుల శాఖ ఆధ్వర్యంలో

నాగార్జున సాగర్ జల వనరుల శాఖ ఆధ్వర్యంలో స్థానిక డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ కార్యాలయం వద్ద ఉద్యోగులతో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు చీపుర్లను చేతబట్టి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ డీఈ మురళీధర్, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, విజయపురిసౌత్ టీడీపీ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, బసివిరెడ్డి, బొబ్బిలి చంద్రశేఖర్, జయరావు, కోటేశ్వరరావు, శ్రీను, రాంచంద్ తదితరులు పాల్గొన్నారు.





ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, జేసీ, ఇతర అధికారులు



వినుకొండ : మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ ఆదేశాల మేరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం వినుకొండ పట్టణంలోని ఏబీఎం కాంపౌండ్ 10, 32వ వార్డుల్లో నిర్వహించారు. ప్రజలకు మూడు డబ్బాల వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్, శానిటరీ ఇన్స్పెక్టర్ షేక్. ఇస్మాయిల్ , వార్డు సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు. పట్టణంలో సురేష్ మహల్ రోడ్ లో నూతనంగా నిర్మించిన పబ్లిక్ టాయిలెట్స్ ను మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ ప్రారంభించారు.

యడ్లపాడు : యడ్లపాడు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. తడిచెత్త, పొడిచెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు.

విద్యుత్ ఉద్యోగుల స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ

దాచేపల్లి : స్థానిక సబ్ డివిజన్ కార్యాలయంలో విద్యుత్ ఉద్యోగులు స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యాలయంలోని అధికారులు, ఉద్యోగులు, రెవెన్యూ సిబ్బంది పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో డీఈఈ టి.వీరేశ్వరరావు, ఏఏఓ పి.సందీప్ కుమార్, జేఏఓ ఆశీర్వాదం, సబ్ ఇంజినీర్ వసంతలక్ష్మి, ఈఆర్‌వో, సబ్ డివిజన్ కార్యాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

కారంపూడి : కారంపూడి మండల ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ఉన్న పరిసరాలను తహసీల్దార్ వెంకటేశ్వర నాయక్, ఎంపిడిఓ గంటా శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులు శుభ్రం చేశారు . కార్యక్రమంలో ఈఓ పిఆర్‌డి కసిన్యా నాయక్, ఆర్ఐ శ్రీనివాసరావు, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి రూరల్ : స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు శ్రమదానం చేశారు. సత్తెనపల్లి సబ్ ట్రెజరీ ఉద్యోగులు కార్యాలయ ఆవరణలో చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. ఎస్‌టీవో కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది పేరుకు పోయిన చెత్తను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ ట్రెజరీ ఉద్యోగులు అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.





వివిధ విభాగాల ఆధ్వర్యంలో చేపట్టిన శుభ్రత కార్యక్రమాలు

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



ప్రజాశక్తి- మాచర్ల

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని మాచర్ల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేషిరెడ్డి అన్నారు. స్వచ్ఛాంధ్ర -స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ మాచర్ల ఆధ్వర్యంలో శనివారం స్థానిక మాచర్ల రవాణా శాఖ కార్యాలయంలో ఎంవీఐ శేషిరెడ్డి, సేవా సమితి చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రవాణా శాఖ అధికారి మాట్లాడుతూ స్వచ్ఛమైన, ఆహ్లాదరకమైన వాతావరణం కోసం నాటిన ప్రతి మొక్కనూ కాపాడుకోవాల్సిన బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. భూ మండలంపై కాలుష్యాన్ని తగ్గించేందుకు, ప్రాణవాయువు శాతాన్ని పెంచేందుకు, వర్షాలు పడేందుకు, విపత్తుల సమయంలో చెట్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతామని, దీనికి తమ వంతుగా కృషి చేస్తామని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.



నారాయణ స్కూల్లో ప్రారంభమైన ఒలింపియాడ్ తరగతులు

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

పట్టణంలోని నారాయణ స్కూల్‌లో శనివారం ఒలింపియాడ్ తరగతులను ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నారాయణ పాఠశాలల రీజనల్ డెవలప్మెంట్ డైరెక్టర్ సింహాద్రి, ఏజీఎం లక్ష్మణ్ రెడ్డి, జెడ్ సిఇవో భద్రరెడ్డి, గౌసియా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ ఒలింపియాడ్ తరగతుల గురించి తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఉల్లారెడ్డి, ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఈ పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థీ ఉన్నత చదువుల కోసం పోటీ పడాల్సి ఉంటుందని, దాని కోసం ఒలింపియాడ్ తరగతులు ఉపయోగపడతాయన్నారు. అడ్వాన్స్ జేఈఈ మెయిన్స్ పరీక్షలకు ఈ ఒలింపియాడ్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జిలు ఆంజనేయులు, ఉదయలక్ష్మి, సునీత, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శివ, కిరణ్, రాజు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

ప్రజాశక్తి-పెదకూరపాడు

అర్థం చేసుకొని చదివినప్పుడే లక్ష్యం నెరవేరుతుందని ఆడిట్ శాఖ స్టేట్ డైరెక్టర్ కొర్లకుంట సుబ్బారావు అన్నారు..పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1981-1986 సంవత్సరం వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు శనివారం 72 వేల రూపాయల ఉపకార వేతనాన్ని 20 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై, పూర్వ విద్యార్థి రామకృష్ణ బాలినేని మాట్లాడుతూ ప్రతి ఏడాది ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులను ప్రోత్సహించడం కోసమే ఈ ఉపకార వేతనాలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. మరో పూర్వ విద్యార్థి నార్నిపాడు జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వీరపనేని రమేష్, మోదేపల్లి రమాదేవి, రావూరి విశ్వనాథ శర్మ, తన్నీరు హరిప్రసాద్ తదితరులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని అన్నారు.

రైతులు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-దాచేపల్లి : ఫార్మర్ రిజిస్ట్రేషన్ రైతు సేవా కేంద్రాలలో చేసుకోవాలని వ్యవసాయ అధికారి డి.పాప కూమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఉచితంగా ఈ సేవలు పొందవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి - అమరావతి

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని అమరావతిలోని అమరేశ్వర స్వామి దేవస్థానంలో ఏర్పాట్లపై సమీక్షా సమావేశాన్ని దేవస్థాన కార్యాలయంలో శనివారం నిర్వహించారు. దేవస్థాన ఈవో సునీల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి మండల తహసీల్దార్ డానియల్ అధ్యక్షత వహించారు. అమరావతి సిఐ అచ్చయ్య, అమరావతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ చందులాల్, ఎంపీడీవో పార్వతి, ఏపీ టూరిజం యూనిట్ మేనేజర్ మణికుమార్, ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్,



పంచాయతీ ఈవో శివ రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొని మహాశివరాత్రి మహోత్సవాల ఏర్పాట్లపై సమీక్షించారు. తహసీల్దార్ డానియల్ మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన ఆర్డీవో రమణ కాంత్ రెడ్డి సమక్షంలో మూడవ సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి- వినుకొండ :స్థానిక ఏపీఎస్‌ఆర్టీసీ డిపో మేనేజర్ జవ్వాజి నాగేశ్వరరావు వెల్లటూరు రోడ్డులోని గుమ్మడి వృద్ధాశ్రమాన్ని సందర్శించి వృద్ధులకు పండ్లు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారికి ఉన్నంతలో అనాథ వృద్ధులను ఆదుకోవాలని, మానవత్వాన్ని కలిగి ఉండాలని కోరారు

రహదారి భద్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి-దాచేపల్లి : రహదారి భద్రత కోరుతూ స్థానిక స్కాలర్స్ స్కూల్ విద్యార్థులు శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి బయలుదేరి నారాయణపురంలోని ఆర్‌అండ్‌బీ బంగ్గా వద్దకు చేరుకొని అక్కడ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల వల్ల ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - వినుకొండ

బొల్లాపల్లి మండలం ఘాటి తండాలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబానికి శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ అండగా నిలిచింది. బాధిత కుటుంబానికి వంట సామగ్రి, నిత్యావసర సరుకులు, 25 కిలోల బియ్యం, దుస్తులు, రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. వినుకొండలోని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు కార్యాలయంలో బొల్లాపల్లి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు బాధిత కుటుంబానికి సంబంధిత సాయం అందజేశారు. బొల్లాపల్లి మండలం ఘాటి తండాకు చెందిన బాబు నాయక్ నివాసం ఉంటున్న గుడిసె బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో కాలిపోయింది. విద్యుదాఘాతంతో మంటలు చెలరేగి దగ్ధమైంది. స్థానిక నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ తరపున ఆర్థిక సాయం అందించారు. తమ కుటుంబానికి అండగా నిలిచిన జీవీ ఆంజనేయులుకు బాబు నాయక్ కుటుంబం కతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో బొల్లాపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జరపాల గోవింద నాయక్, పెమ్మసాని నాగేశ్వరరావు, హనుమా నాయక్, విష్ణు నాయక్, తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి చేబ్రోలు

మండలపరిషత్ ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర స్వఛాంద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. వేజెండ్ల గ్రామంలో హౌసింగ్ లేఅవుట్ -1లో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వడ్డే శంకర్ పాల్గొన్నారు. సోక్‌పిట్ కొలతలు, నిర్మాణ పని విధానాన్ని పరిశీలించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి నుండి వచ్చే వ్యర్థపు నీటి నిర్వహణ, సోక్‌పిట్ ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. గ్రామంలో సాంక్షన్ అయిన 62 సోక్ పిట్లను వేగవంతంగా పూర్తి చేయాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది కి , మండల , గ్రామ అధికారులకు సూచించారు . పంచాయతీ కార్యదర్శి శరణు వేణుగోపాలరావు ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంద్ర ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఇంటి నుంచి వచ్చే చెత్త సేకరణలో మూడు డస్ట్ బిన్నుల విధానం గురించి ఎంపీడీవో ఎ.ఉమాదేవి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈవో పిఆర్ అండ్ ఆర్‌డి టి ఉషారాణి, పంచాయతీ కార్యదర్శి శరణు వేణుగోపాల రావు, ఏఈ హౌసింగ్ ఓబుల్ రెడ్డి, ఏఈ ఆర్డబ్ల్యూ ఎస్ పి శ్రీనివాసరావు, స్వచ్ఛభారత్‌మిషన్ మండల కోఆర్డినేటర్ జి ప్రసాద్‌రావు హౌసింగ్, సచివాలయ సిబ్బంది, ఎన్‌ఆర్ ఈజీఎస్ సిబ్బంది, ఐసిడిఎస్ సూపర్వైజర్ అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.


చేనేత కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కొరకు పాటు పడుతాం..

మంగళగిరి ఈనెల 15వ తేదీ మూడవ శనివారం "స్వచ్ఛంధ్ర - స్వర్ణాంధ్ర" కార్యక్రమంలో భాగంగా మంగళగిరి లోని ఆంధ్రప్రదేశ్ చేనేత, జౌళి శాఖ కమిషనర్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది "స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్" కొరకు పాటుపడతామని ప్రతిజ్ఞ చేశారు. పేపర్ రహిత పాలన ద్వారా ప్రకృతిని కాపాడతా మని, తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళిశాఖ అదనపు సంచాలకులు ఏ మురళీ కృష్ణ, సంయుక్త సంచాలకులు కే.కన్నబాబు, ఉపసంచాలకులు బి.నాగేశ్వరావు పాల్గొన్నారు.

మంగళగిరిలో స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్

మంగళగిరి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా ప్రతి నెల మూడో శనివారం మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పార్క్‌రోడ్డు, పాతమంగళగిరి ప్రాంతాలలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ కే శకుం తల మాట్లాడుతూ ఇంటి వద్ద వ్యర్థాలను మూడు విధాలుగా వేరు చేయడం పొడిచెత్తతో సేంద్రీయ ఎరువుల తయారీ వాటి ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇంటి నుండి వెలువడే తడి చెత్త పొడి చెత్త హానికర వ్యర్థాలను మూడు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న కార్పొరేషన్ అధికారులు

రంగుల ప్లాస్టిక్ బిన్‌లలో వేరు వేరుగా చేసి చెత్త బండికి ఇవ్వాలని తెలిపారు.కార్యక్రమంలో ఎసిపి అంజన జేమ్స్, సెక్రెటరీ దివ్య కుమారి, అన్ని విభాగముల శాఖాధిపతులు, నగరపాలకసిబ్బంది పాల్గొన్నారు.


చిలువూరు గ్రామంలో మొక్కలు నాటుతున్న అధికారులు

పరిశుభ్రత పాటించకపోతే అనారోగ్య సమస్యలు

దుగ్గిరాల స్వర్ణాంధ్ర స్వచ్ఛంద్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని చిలువూరు గ్రామంలో అధికార యంత్రాంగం ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను వేరువేరుగా డస్ట్‌బిన్‌లలో వేయించి వాటి ప్రాముఖ్యతను తెలిపారు. పరిశుభ్రత పాటించకపోవడం వల్ల ఎదురయ్యే అనారోగ్య సమస్యలు వివరించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి పారిశుద్ధ్యం పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఐసునీత ఎంపీడీవో ఏ.శ్రీనివాసరావు ఏపిఎం జి.సురేష్ హౌసింగ్ ఏఈ సుబ్బారావు ఎంఈఓ కే.శ్రీనివాసరావు ఆర్ఐ త్రివేణి ఎస్‌బిఎం కోఆర్డినేటర్ రాజేష్ గ్రామ కార్యదర్శి ఎం శరత్ పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతోనే స్వచ్ఛంధ్ర

ప్రజాశక్తి - తుళ్లూరు


మాట్లాడుతున్న నవీన్

ఉద్యోగులందరూ తాము పనిచేసే కార్యాలయాల్లో తప్పనిసరిగా స్వచ్ఛత పాటించాలని, ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే స్వచ్ఛాంధ్ర కార్యక్రమం విజయ వంతమవుతుందని సిఆర్‌డిఎ అదనపు కమిషనర్ మల్లారపు నవీన్ అన్నారు. ఇళ్లల్లోనే కాకుండా ఆఫీసుల్లోనూ స్వచ్ఛతను పాటించడం ప్రతి ఉద్యోగి బాధ్యతని అన్నారు. విజయవాడలోని సిఆర్‌డిఎ కార్యాలయంలో శనివారం జరిగిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మంచి రాజధాని నిర్మాణంలోనే కాదు స్వచ్ఛత విధానాలు పాటించడంలోనూ సిఆర్‌డిఎ ఉద్యోగులు ఆదర్శంగా ఉండాలని కోరారు. అంతకు ముందు సిఆర్‌డిఎ స్వచ్ఛాంధ్ర నోడల్ అధికారి ఎ.అజయ్ కుమార్ ఉద్యోగులందరితో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సిఆర్‌డిఎ డైరెక్టర్ (ఆఫీస్ మేనేజ్ మెంట్) వల్లభనేని శ్రీనివాస్ స్వచ్ఛాంధ్ర లక్ష్యసాధనపై అందరికీ అవగాహన కల్పించారు. ఈఎస్‌హెచ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఆర్కిటెక్చర్ మంజిరి ఇనాందార్ వ్యర్థాల నిర్వహణపై మాట్లాడారు. అనంతరం ఈఎస్‌ఎంయూ- ఓహెచ్‌ఎస్ బృందం నుంచి వి.ప్రదీప్ హౌస్ కీపింగ్ కార్యకలాపాలపై, యు.పాల్ సుధాకర్ ఫైర్ సేఫ్టీ అంశంపై ప్రసంగించారు.


మాట్లాడుతున్న నవీన్

సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి దుగ్గిరాల

ప్రముఖ ఆధ్యాత్మికవేత్త సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను శనివారం మండల కేంద్రం దుగ్గిరాలలో సుగాలీలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ హింస సిద్ధాంతానికి ఆయన పునాదులు వేశారని కొని ఆడారు. సమాజ శ్రేయస్సు కోసం ఆయన చూపించిన మార్గం ఆదర్శనీయమన్నారు. తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగ రాష్ట్ర కార్యదర్శి గూడూరు వెంకటరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరనాయక్, శంకర్‌నాయక్ లక్ష్మా నాయక్, రమేష్‌నాయక్, కొండనాయక్, సందీప్‌నాయక్, చక్ర వర్తి నాయక్, బాపయ్య నాయక్ పాల్గొన్నారు.


డైరీని ఆవిష్కరిస్తున్న శ్రీదేవి, యూనియన్ నాయకులు

డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-తాడేపల్లి

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా జర్నలిస్టులు పని చేయాలని మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి సూచించారు. శనివారం ఐఎఫ్‌డబ్ల్యుజె (ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్) ఆధ్వర్యంలో 2025 డైరీని ఆమె కార్యాలయంలో ఆవిష్కరించారు. రాజ్యాంగం ఆవిష్కరించిన సందర్భంలోనే ఐఎఫ్‌డబ్ల్యుజె వంటి యూనియన్ రావడం సంతోషమన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు పి.రామకృష్ణ, పి.చార్లెస్, ఎన్‌టి ఆర్ జిల్లా అధ్యక్షులు కె.వెంకట్ పాల్గొన్నారు.

పోరాట యోధుడు ధర్మ బిక్షం

ప్రజాశక్తి మంగళగిరి

గీత కార్మికుల సంఘం ఆధ్వర్యంలో మంగళగిరి పట్టణంలోని సీతారామ కోవెల వద్ద గల సర్దార్ గౌతు లచ్చన్న గౌడ కమ్యూనిటీ హాల్‌లో బొమ్మ గాని ధర్మభిక్షం 103వ జయంతి సభను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముందుగా తెలంగాణ పోరాటయోధుడు బొమ్మగాని ధర్మ బిక్షం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమానికి గీత పరివార కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల కాశయ్య సభకు అధ్యక్షత వహించారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వర రావు మాట్లాడుతూ పార్టీలకు, కుల మతాలకు అతీతంగా ధర్మ బిక్షాన్ని తెలంగాణ ప్రజలు విప్లవ కారుడుగా ఆరాధించేవారని అన్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశంకర్రావు మాట్లాడుతూ రాజకీయాలలో నిస్వార్థంగా తన వాణిని పార్లమెంటులో వినిపించారని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర చేతివృత్తుల సంఘం కార్యదర్శి రామాంజనేయులు, తెలంగాణ గీత పరివార్ల సంఘం నాయకులు ప్రవీణ్, వి.భవాని, బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు కె.స్వాతి గౌడ్, గుంటూరు జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పి.మహేష్, మంగళగిరి నియోజకవర్గం గౌడ సంఘ అధ్యక్షులు వి.మాధవరావు పాల్గొన్నారు.

ముగిసిన పోషణ్ భీ పడాయి భీ శిక్షణ తరగతులు


ప్రజాశక్తి-తెనాలిరూరల్

అంగన్‌వాడీ కార్యకర్తలకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ కోఆపరేషన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించే పోషణ్ భీ పడాయి భీ శిక్షణ తరగతులు శనివారంతో ముగిసాయి. తెనాలి మున్సిపాలిటి, తెనాలి రూరల్, కొల్లిపర మండలాల్లో ఉన్న 200 అంగన్వాడీ కేంద్రాలకు సంబంధించిన అంగన్వాడీ కార్యకర్తలు శిక్షణ తరగతులకు హాజరయ్యారు. దివ్యాంగ చిన్నారులు-స్క్రీనింగ్, ఇంక్లూజన్, రిఫరెన్స్ దివ్యాంగుల చిన్నారుల ప్రోటోకాల్, పిల్లల పెంపకం పద్ధతులపై సంరక్షకుని అవగాహన, గృహ సందర్శనలు, మూల్యాంకన అంగన్వాడీ కేంద్రాలను శిక్షణ కేంద్రాలుగా మార్చటం అంశాలపై తరగతులు నిర్వహించినట్లు తెనాలి ప్రాజెక్టు సిడిపిఒ డాక్టర్ ఎం సునీత తెలిపారు. పోషణ్ భీ పడాయి భీ మూడు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమాల్లో అభ్యసిం చిన అంశాలను అన్ని అంగన్వాడి కేంద్రాల్లో అమలు పరచాలని అన్నారు. కొత్తపేట


మాట్లాడుతున్న డాక్టర్ హనోక్

బాలురోన్నత పాఠశాలలో పినపాడు యుపిహెచ్‌సి వైద్యులు డాక్టర్ హనోక్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సిహెచ్ హిమబిందు, మారీస్ పేట ఉన్నత పాఠశాలలో ఐసిడిఎస్ సూపర్వైజర్ వైనాగమణి, కొలక లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసిడిఎస్ సూపర్ వైజర్లు కె వెంకటలక్ష్మీ, జి వెంకట రమణ, కొల్లిపర జిల్లా పరిషత్ పాఠశాలలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు టిరాధిక, యానాదమ్మ ప్రధాన శిక్షకులుగా వ్యవహరించారని తెలిపారు.

శిల్పి చేతిలో ఉలి త్రీడి చేతుల్లో కాటూరి



త్రీడి శిల్పాన్ని ఆవిష్కరించిన మార్గదర్శి ఎండి శైలజా కిరణ్

ప్రజాశక్తి-తెనాలిరూరల్

లోహపు వస్తువుల తయారీ రంగంలో తెనాలి ఘనతను ప్రపంచ వ్యాప్తంగా ఇనుమడింపజేస్తున్న కాటూరి ఆర్ట్ గ్యాలరీ దేశానికే గర్వకారణమని మార్గదర్శి మేనేజింగ్ డైరెక్టర్ శైలజా కిరణ్ అన్నారు. తెనాలి గ్రామం కంచర్ల పాలెంలో కొలువు తీరిన కాటూరి ఆర్ట్ గ్యాలరీని ఆమె శనివారం సందర్శించి గ్యాలరీలో రూపుదిద్దుకుంటున్న తన తండ్రి డాక్టర్ సుందర నాయుడు విగ్రహంతో పాటు అనేక వియుక్త విగ్రహాలను ఆద్యంతం తిలకించారు. అనంతరం ప్రముఖ 3డి చిత్రకారుడు కాటూరి శ్రీ హర్ష రూపొందించిన "వార్త శ్రింగం-అబ్స్ట్రాక్ట్(అమూర్త) శిల్పం"ఆవిష్కరించారు. శైలజా కిరణ్ మాట్లాడుతూ రెండేళ్ల క్రితం మృతిచెందిన తన తండ్రి విగ్రహ తయారీ బాధ్యతలను సూర్య శిల్పశాల వ్యవస్థాపకులు కాటూరి వెంకటేశ్వరరావుకు అప్పగించినట్లు తెలిపారు. చిత్రకారుడు కాటూరి రవిచంద్ర చేతులమీదుగా రూపుదిద్దుకుంటున్న విగ్రహం దాదాపు పూర్తి కావొచ్చిందని చెప్పారు. జీవకళ ఉట్టిపడేలా ప్రతిమలను రూపొందిస్తున్న రవిచంద్రను అభినందించారు. మారుతున్న కృత్రిమ మేథస్సుకు అనుగుణంగా కమ్యూనికేషన్ రంగంలో కళ, శాస్త్రాలను, సాంకేతిక పరిజ్ఞానం మేళవింపుతో ఈ "వార్తా శ్రింగం-అమూర్త శిల్పం" రూపొందించినట్లు శ్రీహర్ష తెలిపాడు. శిల్పం రూపకల్పనకు త్రీడి మోడలింగ్, కత్రిమ మేధస్సు, త్రీడి ప్రింటింగ్ ఉపయోగించినట్లు శ్రీహర్ష తెలిపాడు. డిజిటల్ అవిష్కరణతో పాటు సంప్రదాయ చేతి పనుల కలయికగా ప్రదర్శించే ఈ త్రీడి శిల్పం "వార్త' (సందేశం) "శంగ"(శిఖరం) నుండి ఉద్భవించిన అబ్స్ట్రాక్ట్ శిల్పంగా మానవ అనుసంధానం పరాకాష్టను సూచిస్తుందన్నారు. మాజీ చీఫ్ విప్, మంత్రి నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ పౌల్ట్రీ దిగ్గజం, ప్రముఖ పారిశ్రామికవేత్త డాక్టర్ సుందరనాయుడు విగ్రహ తయారీ కాటూరి శిల్పశాలకు దక్కడం ముదావహం అన్నారు. తొలుత కుమార్ ఇండస్ట్రీస్ అధినేత కొత్తా సుబ్ర హ్మణ్యం, మంత్రి నన్నపనేని రాజకుమారి, కాటూరి వెంకటేశ్వరరావు తదితరులు శైలజ కిరణ్‌కు స్వాగతం పలికారు. కార్యక్రమంలో కళారంగ అభిమానులు, సూర్య శిల్ప శాల సిబ్బంది పాల్గున్నారు.



మాట్లాడుతున్న నోడల్ అధికారి సంజీవరావు

పట్టభద్రుల ఓటర్లకు అవగాహన కార్యక్రమం

ప్రజాశక్తి మంగళగిరి

భారతీయ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు "స్వీప్" యాక్టివిటీస్‌లో భాగంగా శనివారం పట్టభద్రుల ఓటర్లకు మంగళగిరిలోని విటీజేఏండిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భం గా జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి, నోడల్ అధికారి సంజీవరావు మాట్లాడుతూ డిగ్రీ పూర్తయిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని, ఆ తర్వాత ఓటు వేయాలని తెలిపారు. ఓటు ద్వారానే మంచి పరిపాలకులను ప్రజలు ఎన్నుకోవాలని కోరారు. పట్టభద్రుల బ్యాలెట్‌లో అభ్యర్థి పేరు ఎదురుగా ఏ భాషలోనైనా అంకెల మాత్రమే వేయాలని కోరారు. ప్రాధాన్యత ఇస్తూ ఓటు వేయాలని కోరారు. ఈ కార్య క్రమంలో కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ కే శకుంతల, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జి.నాగేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు.

శ్రీమేధ విద్యార్థిని అభినందించిన ఎమ్మెల్యే నసీర్

ప్రజాశక్తి-గుంటూరు

ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ప్రకటించిన సిఎంఎ ఫైనల్ ఫలితాలలో ఆలిండియా 18వ ర్యాంకు సాధించిన శ్రీమేధ విద్యార్థి షేక్.మొహమ్మద్ అలీని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ శనివారం తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామర్స్ కోర్సులే సి.ఎ, సిఎంఎ పూర్తి చేసిన విద్యార్థులకు మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. దేశ ఆర్థికాభివృద్ధిలో వీరి పాత్ర గణనీయంగా ఉందన్నారు. ఎంతో మంది కామర్స్ ప్రొఫెషనల్స్‌గా తీర్చిదిద్దుతున్న శ్రీమేధ విద్యాసంస్థలను ఆయన ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో శ్రీమేధ విద్యా సంస్థల డైరెక్టర్ అన్నా నందకిషోర్, గుంటూరు టిడిపి పార్లమెంటరీ కోశాధికారి కొనకళ్ల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


అలీని అభినందిస్తున్న ఎమ్మెల్యే

హిందూ ఫార్మసీ కాలేజి అధ్యాపకురాలికి డాక్టరేట్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అమరావతి రోడ్డు లోని హిందూ ఫార్మసీ కళాశాల ఫార్మాసుటికల్ బయో టెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్, విభాగాది పతి జొన్నా శివజ్యోతికి జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం హైదరాబాద్ డాక్టరేట్ ప్రదానం చేసిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు స్వాతి కాలేజీ ఆఫ్ ఫార్మసీ రీసెర్చ్ డైరెక్టర్, ప్రొఫెసర్ డాక్టర్ కడింపాటి కిషోర్ కుమార్ పర్యవేక్షణలో 'పుల్లులనేజ్, లాకేజ్ యొక్క సూక్ష్మజీవుల నుండి ఉత్పత్తి, శుద్ధీకరణ: జీవసంబంధమైన అనువర్తనాలు' అనే అంశంపై శివజ్యోతి పరిశోధన చేశారన్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూదనరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ప్రత్యూష, తదితరులు ఆమెకు అభినందనలు తెలిపారు.



శివజ్యోతిని అభినందిస్తున్న జూపూడి రంగరాజు


ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ తదితరులు

కళ్ళం కాలేజి విద్యార్థులకు ఇన్ఫోసిస్‌లో ఉద్యోగాలు

ప్రజాశక్తి-గుంటూరు

కళ్ళం ఇంజినీరింగ్ కాలేజిలో 2025 విద్యా సంవత్సరంలో బి.టెక్ పూర్తి చేసుకోబోతున్న 11 మంది కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్, డేటా సైన్స్ విభాగాలకు చెందిన విద్యార్థులు విద్యార్థులు ఉద్యోగాలు పొందారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకరరెడ్డి తెలిపారు. ఇటీవల నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో ఉద్యోగాలు పొందిన ఇంజనీరింగ్ విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ట్రైనీ ఉద్యోగాలు పొందారని, వార్షిక వేతనం రూ.3.60లక్షలు పొందుతారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఎస్.బి రెడ్డి తెలిపారు.శనివారం ఉద్యోగాలు పొందిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్‌తోపాటు, ఉపాధి కల్పనాధికారి డాక్టర్ పి.ఎల్.మాధవరావు, వివిధ విభాగాధిపతులు డాక్టర్ సన్నీడియోల్, డాక్టర్ తారకేశ్వరరావు, డాక్టర్ జెట్సన్ అభినందించారు.

ఘనంగా ప్రభుత్వ మహిళా కాలేజి వార్షికోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజి 83వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఆర్. జ్యోత్స్న కుమారి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిధిగా ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ శనక్కాయల అరుణ, యాని మల్ హస్బెండరీ డిపార్ట్‌మెంట్ అడిషనల్ డైరెక్టర్ అబ్రహం లింకన్ హాజరయ్యారు. ప్రిన్సిపాల్ కళాశాల వార్షిక నివేదికను ప్రవేశపెట్టగా, స్టూడెంట్ యూనియన్ కన్వీనర్ సుబ్బరత్నమ్మ కళాశాల విద్యార్థులు సాధించిన ప్రగతిని వివరించారు. డాక్టర్ శనక్కాయాల అరుణ కళాశాల పూర్వ విద్యార్థినిగా తన గత స్మృతులను విద్యార్థులతో పంచుకున్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం స్త్రీల పరిస్థితులు వివరించి, ఆ నేపథ్యంలోనే స్త్రీ విద్య కోసం లేడీ హోప్ పేరుతో గుంటూరు నడిబొడ్డున ఈ కళాశాల రూపుదిద్దుకోవటం, స్త్రీ జనోద్ధరణకు, స్త్రీ విద్య ప్రాముఖ్యతకు కృషి చేయటం తదితర అంశాలను తెలియజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న ప్రోత్సాహకాలను విద్యార్థులు అందిపుచ్చుకొని, విజయపథం వైపు పయనించాలని అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శనక్కాయాల అరుణ కళాశాలలో మూడు తరగతి గదులు నిర్మించి ఇస్తానని ప్రకటించారు. అనంతరం సాహిత్యం, సాంస్కృతిక, ఆటల పోటీలలో విజేతలకు అతిథుల చేతులమీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



డాక్టర్ శనక్కాయల అరుణను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

ప్రజల మనిషి లక్ష్మణరావును గెలిపించండి : ఐలు

ప్రజాశక్తి-గుంటూరు

కృష్ణా- గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి ఈనెల 27న జరిగే ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావును గెలిపించాలని ఆలిండియా లాయర్స్ యూనియన్(ఐలు) పిలుపునిచ్చింది. యూనియన్ జిల్లా జనరల్‌బాడీ సమావేశం శనివారం స్థానిక బ్రాడీపేటలోని యుటిఎఫ్ సమావేశ మందిరంలో నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు, జాతీయ కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు, బి.సలీం, లీలాకృష్ణ, గోపి, స్టాలిన్ పాల్గొని ప్రసంగించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజల మనిషి కెఎస్ లక్ష్మణరావు గెలిపించటం ద్వారా ప్రజల వాణిని చట్ట సభల్లో వినిపించటానికి ఆస్కారం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఐలు జిల్లా అధ్యక్షులుగా వినుకొండకు చెందిన న్యాయవాది సిహెచ్ఎల్ఎన్ మూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు జి.శేషగిరిరావు, జిల్లా వ్యాప్తంగా న్యాయవాదులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిహెచ్ఎల్ఎన్ మూర్తి

గ్రూప్-2 మెయిన్స్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమీషన్ ఈనెల 23వ తేదీన నిర్వహించే గ్రూప్ -2 మెయిన్స్ పరీక్ష పటిష్టంగా నిర్వహించటానికి ఏర్పాట్లు చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ అధికారుల్ని ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో డిఆర్ఒ ఎన్.ఎస్.కె.ఖాజావలితో కలిసి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ గ్రూప్ -2 సర్వీసెస్ ఉద్యోగాల నియామకానికి సంబంధించి మెయిన్స్ పరీక్ష ఈనెల 23న ఉదయం 10 గంటల నుండి 12.30 గంటల వరకూ పేపర్-1, మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకూ పేపర్-2 పరీక్ష నిర్వహిస్తున్నారన్నారు. గుంటూరు జిల్లాలో 11పరీక్షా కేంద్రాలలో 9,277అభ్యర్థులు హాజరు అవుతున్నారన్నారు. జిల్లాలోని 11 పరీక్ష కేంద్రాలకు 11మంది సీనియర్ జిల్లా అధికారులను లైజనుఆఫీసర్లుగా నియమించామని చెప్పారు. సమావేశంలో పరీక్ష నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లుపై లైజను ఆఫీసర్లకు తగు సూచనలను జారీ చేసి ప్రతి అధికారిని తమకు కేటాయించిన పరీక్ష కేంద్రమును సందర్శించి అక్కడ చీఫ్ సూపరింటెండెంట్, వారి సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి పరీక్ష నిర్వహణ సజావుగా జరిపించేందుకు తీసుకొనవలసిన జాగ్రత్తలు తెలియజేశారు.


పరీక్షల నిర్వహణపై సమీక్షిస్తున్న జేసీ

సెయింట్ ఆన్స్‌లో కామర్స్ ఫెస్ట్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో అంతర్ కళాశాల కామర్స్ ఫెస్ట్ 'కామ్ ఇగ్నైట్ -2025' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య.టి అధ్యక్షత వహించగా, ప్రభుత్వ మహిళా కాలేజి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.త్యాగరాజు పాల్గొని ప్రపంచీకరణలో, వ్యవస్థాపకతలో స్త్రీల పాత్రను వివరించారు. అనంతరం విద్యార్థినులు బిజినెస్ గేమ్, బ్రాండ్‌రేస్ వంటి కార్యక్రమాలలో పాల్గొన్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థినులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆర్.షారూన్‌రోజ్, కామర్స్ విభాగాధిపతి జె.ప్రమీలరాణి, ఎం.అంజనాదేవి, జి.సరోజ, షేక్.సుభాని పాల్గొన్నారు.



పాల్గొన్న విద్యార్థినులు

విజయం కోసం విస్తృత ప్రయత్నాలు



శాసన మండలి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గంకు ఈనెల 27న జరగ ునున్న ఎన్నికల్లో నామినేషన్ల ఉపసంహరణ అనంతరం 25 మంది బరిలో నిలిచారు. మొత్తం 40 మంది నామినేషన్లు దాఖలు చేయగా, 10 మంది అభ్యర్థుల నామినేషన్లను వివిధ కారణాలతో తిరస్కరించగా 30 మంది నామినేషన్లను ఆమోదించారు. వీరిలో ఐదుగురు ఉపసంహరించుకోవడంతో 25 మంది పోటీలో ఉన్నారు. ప్రధాన పోటీ పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు, టిడిపి కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మధ్య జరుగుతోంది. గత సోమవారం గుంటూరులో లక్ష్మణరావు నామినేషన్ కార్యక్రమానికి పట్టభద్రులు భారీ సంఖ్యలో హాజరు కావడం టిడిపి కూటమి నేతలను కలవరపాటుకు గురిచేసింది. దీంతో కూటమి నేతలు అన్ని శక్తులను ఉపయోగిస్తున్నారు. 14 ఏళ్లుగా ఎమ్మెల్సీగా పనిచేసిన కెఎస్ లక్ష్మణరావుకు ఉన్న ప్రజా సంబంధాలతో ప్రజా సంఘాల మద్దతు గెలుపునకు సానుకూలంగా మారాయి. ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు టిడిపి కూటమి నేతలు,కార్యకర్తలతో ఉన్న సంబంధాలు మెరుగ్గా ఉన్నాయి. టిడిపిలో అంతర్గతంగా ఉన్న ప్రతికూల పరిస్థితులు ఆయనకు ఇబ్బంది కరంగా మారాయి. పార్టీ అధినాయత్వం జోక్యం చేసుకుని ఆలపాటికి సహకరించని వారిని బుజ్జగించే ప్రయత్నం చేస్తుంది. ఆలపాటిటిని తీవ్రంగా వ్యతిరేకించిన దూళిపాళ్ల నరేంద్రను మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు బుజ్జగించగా ఆయన మెత్తపడ్డారు. ఆలపాటి గెలిస్తే తమ ఉనికికి ఇబ్బంది వస్తుందనే భయం కొంత మంది టిడిపి నాయకులను వెంటాడుతోంది. కానీ పైకి అందరూకలిసి పనిచేస్తున్నట్టు కన్పిస్తున్నా అంతర్గతంగా కూటమిలో ఆయనకు పలు సమస్యలు వెంటాడుతున్నాయి. అయితే పార్టీ రాష్ట్ర యంత్రాంగం మొత్తం ఆలపాటికి అనుకూలంగా పావులు కదుపుతుండటంతో ఆలపాటికి లక్ష్మణరావుకు మధ్య గట్టిపోటీ ఏర్పడింది. ప్రచారానికి ఈనెల 25 తుది గడువు కావడంతో ఇంకా కేవలం 9 రోజులు మాత్రమే సమయం ఉండటంతో అభ్యర్థులంగా పోటాపోటీగా ప్రచారంలో పాల్గొంటున్నారు. పట్టభద్రులుగా ఉన్న ఓటర్లను కలుసుకునేందుకు కెఎస్ లక్ష్మణరావు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. రెండు ఉమ్మడి జిల్లాల పరిధిలో 33 నియోజకవర్గాల్లో 3.46 లక్షల మంది ఓటర్లను కలుసుకునేందుకు అభ్యర్థులు, వారికి మద్ధతు ఇస్తున్న సంఘాల ద్వారా ప్రయత్నిస్తున్నారు. లక్ష్మణరావుకూడా ఇప్పటికే తొలి విడత ప్రచారం ముగించారు. తనకు మద్ధతు ఇస్తున్న వివిధ సంఘాల నాయకులు, సంఘాల సభ్యులు కూడా ఓటర్లను కలిసి లక్ష్మణరావుకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతున్నారు. ఇప్పటికే వివిధ ప్రజా సంఘాల మద్ధతు ఉంది. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, నిరుద్యోగులు లక్ష్మణరావుకు మద్ధతు ఇస్తున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, నిరుద్యోగులతో పాటు రైతులు,కౌలు రైతులు,చేనేత కార్మికులు, స్కీం వర్కర్లు ఇలా అనేక రంగాలకు చెందిన వారి సమస్యలను గత 14 ఏళ్లుగా శాసన మండలిలో ప్రస్తావించి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తున్నారు. దీంతో ఆయా తరగతుల వారు ఎన్నికల్లో లక్ష్మణరావుకు మద్ధతు ఇస్తారని పరిశీలకులు భావిస్తున్నారు. అంతేగాక లక్ష్మణరావుకు మద్ధతుఇస్తున్న ప్రజా సంఘాల వారు ప్రజల తరుపున మాట్లాడాలంటే అధికార పక్షంలో ఉంటే మాట్లాడలేరని ప్రతిపక్షంలోనే మాట్లాడగలరని ఓటర్లకు వివరిస్తున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్న ప్రజా సమస్యలపై మండలి లో పోరాడే పిడిఎఫ్ అభ్యర్థి కె. ఎస్.లక్ష్మణరావు 14 ఏళ్లుగా ఎమ్మెల్సీగా ప్రజాగళం విన్పించారని గుర్తు చేస్తున్నారు. రాజ్యాంగ నిర్మాతలు పట్టభద్రులు, ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా మండలిలో కొన్ని స్థానాలు కేటాయిస్తే వీటిల్లోకి రాజకీయ పార్టీలు పోటీ చేయటం వల్ల ప్రజలకు మేలు జరగదని లక్ష్మణరావు ప్రజలకు వివరిస్తున్నారు. అయితే టిడిపి అభ్యర్థి ఆలపాటికి కూటమి పార్టీలన్నీ మద్దతు ఇస్తున్నాయి. సాధారణ ఎన్నికల ప్రచారం మాదిరిగా నిర్వహిస్తున్నారు.

(ఎ.వి.డి.శర్మ)